విశాలాంధ్ర

ఏలూరు, పశ్చిమ గోదావరి
కాకినాడ, కోనసీమ
తూర్పుగోదావరి

మంగళవారం 07 జనవరి 2025 8 పేజీలు

నేరాల నియంత్రణకు డ్రోన్ వ్యవస్థ

మినీ డ్రోన్ సమ్మిట్‌లో పాల్గొన్న ఎస్పీ కిషోర్, జేసీ రెడ్డి, ఏఎస్పీ చంద్రరావు

విశాలాంధ్ర ప్రతినిధి- ఏలూరు : రాబోయే రోజుల్లో నేరాల నియంత్రణతో పాటు, ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు డ్రోన్ వ్యవస్థ ఎంతగానో దోహదపడుతుందని ఏలూరు జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ చెప్పారు. సోమవారం ఏలూరులోని జిల్లా ఎస్పీ కార్యాలయంలో జిల్లా పోలీస్ అధికారులతో ఏర్పాటు చేసిన మినీ డ్రోన్ సమ్మిట్ కార్యక్రమంలో జేసీ ధాత్రి రెడ్డి, ఏఎస్పీ ఎన్.సూర్యచంద్రరావుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ కిషోర్ మాట్లాడుతూ అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో సిద్ధం చేసిన డ్రోన్ల ద్వారా జిల్లా వ్యాప్తంగా అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా, నేరస్తుల కదలికలను ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చు న్నారు. నిబంధనలకు విరుద్ధంగా పార్కింగ్ చేసిన వాహనాలను గుర్తించడం,

ఆటోమేటెడ్ చలానాలు విధించడానికి, రద్దీ సమయాల్లో ట్రాఫిక్ క్రమబద్ధీ కరణ, నేరాల నియంత్రణ, ప్రముఖుల పర్యటనలు, ముందస్తు భద్రత చర్యలు వంటి అనేక ఉపయోగాలు ఈ డ్రోన్ల వల్ల ఉన్నాయన్నారు. జిల్లా వ్యాప్తంగా ఈ వ్యవస్థను పూర్తిస్థాయిలో అమలు చేసేందుకు ప్రథమంగా ఏలూరును పైలెట్ ప్రాజెక్టుగా తీసుకున్నట్లు తెలిపారు. జేసీ ధాత్రి రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే డ్రోన్ సమ్మిట్ ను నిర్వహించిందని, దానిని పురస్కరించుకొని మినీ డ్రోన్ సమ్మిట్‌ను ఏలూరులో నిర్వహించినట్లు తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానంతో ఇప్పటికే డ్రోన్ ద్వారా భూముల సర్వే నిర్వహిస్తున్నా మని చెప్పారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ అధికారులు, అటవీ శాఖ, అగ్నిమాపక శాఖ, రవాణా శాఖ అధికారులు, ఎస్బి ఇన్స్పెక్టర్ మల్లేశ్వరరావు, బి.అది ప్రసాద్, ఏలూరు డిఎస్పి డి. శ్రావణ్ కుమార్ జంగారెడ్డిగూడెం డిఎస్పి యు.రవిచంద్ర, పోలవరం డిఎస్పి ఎం. వెంకటేశ్వరరావు, సిఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

పేపర్ మిల్లు కార్మికులకు సీపీఐ, ఏఐటీయూసీ మద్దతు

విశాలాంధ్ర – రాజమహేంద్రవరం : గత మూడు రోజులుగా వేతన ఒప్పందం కోసం, న్యాయమైన డిమాండ్ల కోసం రాజమండ్రి పేపర్ మిల్లు కార్మికులు సమ్మె చేస్తున్నా యాజమాన్యం, ప్రభుత్వం మొండివైఖరి అవలంబిస్తున్న దని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు, ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ కె. రాంబాబు అన్నారు.

కార్మికులు చేస్తున్న న్యాయమైన సమ్మెకు సిపిఐ, ఏఐటీయూసీ జిల్లా కమిటీలు సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నా యని, భవిష్యత్తులో వారు చేసే పోరాటానికి సిపిఐ, ఏఐటీయూసీ, వివిధ ప్రజా సంఘాలు అండగా ఉంటాయని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు ప్రకటన విడుదల చేశారు. కార్మికుల కష్టాన్ని, శ్రమను దోచుకుంటున్న ఆంధ్ర పేపర్ మిల్లు ▶మిగతా 2లో..

పిజిఆర్ఎస్‌లో 276 అర్జీలు

కలెక్టర్ కె. వెట్రిసెల్వి

విశాలాంధ్ర – ఏలూరు : పిజిఆర్ఎస్(ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ) ద్వారా అందిన అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయం గోదావరి సమావేశ మందిరంలో జరిగిన జిల్లాస్థాయి పిజి ఆర్ఎస్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి.. జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి, డిఆర్వో వి.విశ్వేశ్వరరావు, ఆర్డీవో అచ్యుత అంబరీష్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె.భాస్కర్‌లతో కలిసి అర్జీలు స్వీకరించారు. జిల్లాలో ▶మిగతా 2లో..

ఇసుక కొరతతో ఉపాధి కోల్పోతున్న కార్మికులు

విశాలాంధ్ర – కాకినాడ : గత ప్రభుత్వ హయాంలో భవన నిర్మాణ కార్మికులు పనులు లేక తీవ్ర ఇక్కట్లు అనుభవించారని సీపీఐ జిల్లా కార్యదర్శి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు కె. సత్తిబాబు పేర్కొన్నారు. సోమవారం రాజోలు అంబేద్కర్ కమ్యూనిటీ హాలులో ఆంధ్రప్రదేశ్ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రథమ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా సత్తిబాబు మాట్లాడుతూ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో లభిస్తున్న ఇసుక స్థానిక అవసరాలు తీర్చిన తర్వాతనే బయటకు తీసుకు వెళ్లాలని జిల్లా యంత్రాంగాన్ని కోరారు. రాజోలు నియోజకవర్గంలో ఇసుక ర్యాంపు లేనందున ఇసుక కొరతతో నిర్మాణ కార్మికుల ఉపాధికి గండిపడుతోందన్నారు. స్థానిక శాసనసభ్యుడు దేవ వర ప్రసాద్ కృషితో సోంపల్లి, దిండిలో రేవులు వచ్చాయని, ఆర్థిక మాంద్యంతో నిర్మాణ రంగానికి

చెందిన ముడి సరుకు ఐరన్, సిమెంటు, పిక్క, ఇటుక రేట్లు విపరీతంగా పెరిగిపోయాయని తెలిపారు. దీంతో సాధారణ గృహస్తులు ఇల్లు నిర్మాణానికి ముందుకు రాలేక సతమతం అవుతున్నారని పేద, మధ్య తరగతి ప్రజలకు ప్రభుత్వమే ఇల్లు నిర్మించి ఇవ్వాలని లేదా ఐదులక్షల రూపాయలు ఇచ్చి ఉచిత, ఇసుక అందించాలని ప్రభుత్వాన్ని సత్తిబాబు డిమాండ్ చేశారు.

భవననిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పెద్దిరెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ గత ప్రభుత్వ వ్యవహారశైలి వల్ల నిర్మాణ కార్మికులు జీవనోపాధి కోల్పోయారని పేర్కొన్నారు. ప్రభుత్వం సంక్షేమ నిధులు దారి మళ్లించింద న్నారు. ప్రభుత్వం కార్మికులకు సంక్షేమ పథకా లను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సిపిఐ జిల్లా నాయకులు దేవా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ఏఐటీయూసీ 105 సంవత్సరాలు సుదీర్ఘ కాలం ఉద్యమించి అనేక కార్మిక చట్టాలను అమలులోకి తెచ్చిందని పేర్కొన్నారు. రాష్ట్ర భవన నిర్మాణ వర్కర్స్ ▶మిగతా 2లో..

జల సంరక్షణ ప్రాజెక్టులపై ప్రత్యేక శ్రద్ధ

కలెక్టర్ చదలవాడ నాగరాణి

విశాలాంధ్ర -భీమవరం: పశ్చిమగోదావరి జిల్లాలో జలశక్తి అభియాన్ కింద చేపట్టిన జల సంరక్షణ ప్రాజెక్టుల పూర్తికి ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. సోమవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తో జలశక్తి అభియాన్ సెంట్రల్ నోడల్ అధికారి – అగ్రికల్చర్, ఫార్మర్స్ వెల్ఫేర్ డైరెక్టర్ డాక్టర్ జితేంద్ర సింగ్ సమావేశమై జిల్లాలో జలశక్తి అభియాన్ కార్యక్రమం కింద చేపట్టిన పనుల పురోగతిపై సంబంధిత అధికారులతో

సమీక్షించారు. జల శక్తి అభియాన్ పనుల పురోగతిపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జే ఎస్ ఏ జిల్లా నోడల్ అధికారి, డ్వామా పిడి డాక్టర్ కే సిహెచ్ అప్పారావు వివరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో జల శక్తి అభియాన్ పనుల అమలు పర్యవేక్షణకు జిల్లా, మండల, గ్రామ స్థాయిలలో కమిటీలను వివిధ శాఖల అధికారులతో ఏర్పాటు చేసినట్టు తెలిపారు. అధికారులందరూ టీం వర్క్‌తో పనిచేస్తున్నట్టు తెలిపారు. జల శక్తి అభియాన్ సెంట్రల్ నోడల్ అధికారి, అగ్రికల్చర్, ఫార్మర్స్ వెల్ఫేర్ డైరెక్టర్ డాక్టర్ జితేంద్ర సింగ్ మాట్లాడుతూ జిల్లాలో జలశక్తి అభియాన్ కింద చేపట్టిన పనుల పురోగతి బాగుందని, అధికారులు టీం వర్క్‌తో పని చేస్తున్నారని అభినందించారు. సమావేశంలో జెఎస్ఏ సైంటిస్ట్ మౌనిక, జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి నాగేశ్వరరావు, జెఎస్ఏ జిల్లా కమిటీ సభ్యులు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్ వెంకటేశ్వరరావు, సిపిఓ శ్రీనివాసరావు, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి, జిల్లా స్థాయి కమిటీ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

అర్జీలు పరిష్కరించాలి

డిఆర్ఓ మొగలి వెంకటేశ్వర్లు

విశాలాంధ్ర -భీమవరం: ప్రజా సమస్యలను జాప్యం లేకుండా పరిష్కరించాలని డిఆర్ఓ మొగలి వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని పిజి ఆర్ఎస్ సమావేశ మందిరంలో జిల్లా రెవెన్యూ అధికారి ప్రజా సమస్యల పరిష్కార వేదిక

కార్యక్రమాన్ని నిర్వహించి, అర్జీలను స్వీకరించారు. ఈ సంద ర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ పిజిఆర్ఎస్ అర్జీల పరిష్కారం పై అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టి పనిచేయాలన్నారు. ప్రతి అర్జీకి సరైన సమాధానం ఇస్తూ పరిష్కరించాలని, ప్రతి అర్జీని ఆడిటింగ్ చేయడం జరుగుతుందన్నారు. ప్రజల నుండి అందే ప్రతి అర్జీని త్వరితగతిన పరిష్కరించాలని అర్జీ పరిష్కారంలో క్షేత్రస్థాయిలో అధికారులు సిబ్బందితో సమన్వయం చేసుకొని చక్కని సమా ధానం ఇవ్వాలన్నారు. వివిధ సమస్యలపై జిల్లాలోని పలు ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి 142 పిటిషన్లను స్వీకరించామన్నారు. ప్రజల నుండి స్వీకరించిన అర్జీలను నిర్దిష్ట గడువులోగా పరిశీలించి పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను డిఆర్ఓ ఆదేశించారు. కార్యక్రమంలో సివిల్ సప్లైస్ జిల్లా మేనేజర్ టి.శివరామప్రసాద్, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీ హైస్కూళ్ళలో నాన్ టీచింగ్ స్టాఫ్‌ను నియమించాలి : పీఆర్‌టీయూ డిమాండ్

విశాలాంధ్ర-ఏలూరు: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని అప్ గ్రేడెడ్ హైస్కూళ్ళలో నాన్ టీచింగ్ స్టాఫ్ ను నియమించాలని డెమొక్రటిక్ పిఆర్టియు జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తలపంటి శ్రీనివాసరావు, నేతల సుభాష్ చంద్రబోస్ కోరారు. 1999 నుంచి ఇప్పటివరకు అప్ గ్రేడెడ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నాన్ టీచింగ్ స్టాఫ్ నియామకాలు జరగలేదని వారు తెలిపారు. ఈ కారణంగా ఉపాధ్యాయుల జీతాల బిల్లులు, అక్విటెన్స్, పే బిల్లులు, హాజరు పట్టీలు, విద్యార్థుల టీసీలు, స్టడీ, కుల ధ్రువీకరణ పత్రాలు, అడ్మిషన్ రిజిస్టర్ తదితర ముఖ్యమైన పనులు నాన్ టీచింగ్ స్టాఫ్ లేనందున ఉపాధ్యా యులే బోధనేతర విధులను తప్పనిసరి పరిస్థితుల్లో నిర్వర్తించాల్సి వస్తోంది. ఈ కారణంగా తరగతి బోధన సాధ్యపడటం లేదు. దీని ప్రభావం విద్యార్థుల పరీక్ష ఫలితాలపై ఉంటుంది. కాబట్టి ఉపాధ్యా యుల సమస్యలను దృష్టిలో పెట్టుకొని తక్షణం అప్ గ్రేడెడ్ జడ్పీ హైస్కూళ్లలో నాన్ టీచింగ్ స్టాఫ్‌ను నియమించాలని వారు ప్రభు త్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు జెడ్పి చైర్పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్, జెడ్పీ సీఈవోలకు వినతి పత్రం సమర్పించారు.

రెవెన్యూ సదస్సులలో సమస్యల పరిష్కారం

విశాలాంధ్ర - లింగపాలెం : లింగపాలెం మండలంలో జరుగుతున్న రెవెన్యూ సదస్సులలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తున్నామని తహసిల్దార్ నజీమ్ తెలిపారు. మరంగూడెంలో జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడుతూ మండలంలో ఇప్పటివరకు 23 రెవెన్యూ గ్రామాలలో సదస్సులు నిర్వహించామని

అన్నారు. ఇప్పటికీ 225 ఫిర్యాదులు అందాయని, వీటిలో 120 ఫిర్యాదులను పరిష్కరించామని వెల్లడించారు. మిగతా సమస్య లను పరిష్కరించే చర్యలు తీసుకున్నామని వివరించారు. రెవెన్యూ సదస్సులలో ఫిర్యాదు అందించలేని వారు నేరుగా తహసిల్దార్ కార్యాలయంలో అందించవచ్చని ఈయన పేర్కొన్నారు. గ్రామాలలో రెవెన్యూ సమస్యలు ఉండటం వల్ల వ్యవసాయంపై ఆధారపడేవారు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఇటువంటి సమస్యలు లేకుండా చేయాలనేదే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. సమావేశంలో ఈయనతో పాటు రీ సర్వే డిప్యూటీ తహసిల్దార్ నాగబాబు,గ్రామ రెవెన్యూ అధికారి దీప్తి తదితరులు పాల్గొన్నారు.

సదరం సర్టిఫికెట్ల పరిశీలన ప్రారంభం

విశాలాంధ్ర-దెందులూరు: జిల్లాలో ఎన్.టి.ఆర్ భరోసా దివ్యాంగుల సదరం సర్టిఫికేషన్ పరిశీలనలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం సదరం సర్టిఫికెట్ పరిశీలన కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ పరిశీలనకు కేటాయించిన గుంటూరు, విజయవాడ, ఒంగోలు నుండి ప్రభుత్వ డాక్టర్లు పరిశీలన ప్రక్రియను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని దెందులూరు మండలంలో 60 మంది ఫించన్ దారుల ఇళ్లకు స్వయంగా వెళ్లి వారి అర్హతను పరిశీలించారు. వీరు బృందాలుగా విడిపోయి వారికి

కేటాయించిన గ్రామాల్లో పరిశీలన చేశారు. ఈ కార్యక్రమాన్ని డి.ఆర్.డి.ఏ ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ ఆర్.విజయరాజు డి.సి.హెచ్.ఎస్ సతీష్, ఎంపిడిఓ శ్రీదేవి పర్యవేక్షించారు.

జిల్లాలో ఓటర్ల సంఖ్య 14,70,852

మహిళా ఓటర్ల సంఖ్యే అధికం

విశాలాంధ్ర- భీమవరం: ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ -2025 ప్రక్రియ అనంతరం ఓటర్ల తుది జాబితాను కలెక్టర్ చదలవాడ నాగరాణి ప్రకటించారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రత్యేక సంక్షిప్త సవరణ-2025 షెడ్యూల్ ప్రకారం తుది ఓటర్ల జాబితాను జనవరి 6,2025న అన్ని పోలింగ్ కేంద్రాలలో, ఎలెక్టోరల్ అధికారి/ సహాయ ఎలెక్టోరల్ అధికారి కార్యాలయములలో, పశ్చిమగోదావరి కలెక్టర్ కార్యాలయంలో ప్రచురణ చేసినట్టు తెలిపారు. తుది జాబితా ప్రచురణ జనవరి 6 నాటికి జిల్లాలోని మొత్తం 1,461 పోలింగ్ స్టేషన్ల పరిధిలో ప్రస్తుతం 14,70,852 మంది ఓటర్లు ఉన్నారన్నారు. వీరిలో పురుష ఓటర్లు 7,20,597 కాగా, మహిళలు 7,50,179, థర్డ్ జెండర్ 76 మంది ఉన్నారు. గత ఏడాది అక్టోబరు 29న ప్రచురించిన ముసాయిదా జాబితాలో 14,71,189 మంది ఉండగా, సవరణల అనంతరం తుది జాబితా నాటికి సుమారు 337 మంది ఓటర్లు తగ్గారు. అత్యధికంగా భీమవరం నియోజకవర్గంలో 2,52,255 మంది ఓటర్లు ఉండగా, అతి తక్కువగా నరసాపురం నియోజకవర్గంలో 1,70,683 మంది ఉన్నారు. సర్వీస్ ఓటర్లు జిల్లాలో మొత్తం 888 మంది ఉండగా వారిలో 868 మంది పురుషులు,20 మంది స్త్రీలు ఉన్నారు. ఎప్పటిలాగే జిల్లాలో పురుషుల కంటే మహిళా ఓటర్లే అధిక సంఖ్యలో ఉండటం విశేషం.

మద్దతు (1వ పేజీ తరువాయి)

యాజమాన్యం కార్మికుల జీవితాలతో చెలగాట మాడుతున్నదని పేర్కొన్నారు. ప్రతి ఏడాది రూ.250 కోట్లు పైగా లాభాలు ఆర్జిస్తున్న పేపర్ మిల్లు యాజమాన్యం ఈ లాభాలకు కారణమైన కార్మికులను మాత్రం నష్టాల ఊబిలోకి నెడుతోందని వారు తెలిపారు. పాత వేతన ఒప్పందం పూర్తయి సంవత్సరాలు గడుస్తున్నా కార్మికులకు కొత్త వేతన ఒప్పందం చేయలేద న్నారు. కనీసం ఎన్నికలు పూర్తయి ఐదు సంవత్సరాలు గడుస్తున్నా గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించలేదన్నారు. పలు న్యాయమైన డిమాండ్స్ కోసం కార్మిక సంఘాలు జేఏసీగా ఏర్పడి పలుమార్లు సమ్మెలు వివిధ రూపాల ఆందోళనలు చేసినా యాజమాన్యం మొండిగా వ్యవహరించిందని తెలిపారు. దీనికి ప్రధాన కారణం కార్మికులకు న్యాయం చేసే కార్మిక శాఖ యాజమాన్యానికి అమ్ముడుపోయిందని మధు, రాంబాబు విమర్శించారు. సీఎం చంద్రబాబుకు నిజంగా కార్మికులపై ప్రేమ ఉంటే యాజ మాన్యాన్ని పిలిపించి వేతన ఒప్పందం చేయించాలి తప్ప కమిటీ వేసి కాలయాపన చేయడం అన్యాయం అన్నారు. కార్మికుల పోరాటానికి రాజమండ్రి ప్రజానీకం సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందని వారు పేర్కొన్నారు.

కార్మికులు (1వ పేజీ తరువాయి)

యూనియన్‌ను బలోపేతం చేసుకుని ముందుకు పోవాలని పిలుపునిచ్చారు.

ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ వాసంశెట్టి సత్తిరాజు మాట్లాడుతూ కార్మిక సమస్యల పరిష్కారానికి, జిల్లా కమిటీ బలోపేతానికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం 27 మందితో జిల్లా కౌన్సిల్, 11మందితో కార్యవర్గం ఎన్నికైంది.

గౌరవ అధ్యక్షులుగా జక్కంపూడి కుమార్ స్వామి, చీఫ్ ఎడ్వైజర్‌గా కుంపట్ల సాయి బాబు, జిల్లా అధ్యక్షులుగా బోణం చిన్న, ఉపాధ్యక్షులుగా బెల్లంకొండ శ్రీనివాస్, తొల్లంగి సూరిబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శిగా కొప్పిశెట్టి నాగార్జున రావు, సహాయ కార్యదర్శిగా నాగరాజు ఎన్నికయ్యారు.

అర్జీలు (1వ పేజీ తరువాయి)

ఆయా ప్రాంతాల నుంచి ప్రజలు అందజేసిన అర్జీలను ఆయా శాఖల అధికారులు త్వరితగతిన పరిష్కరించి నాణ్యతగల ఎండార్స్‌మెంట్ అంద జేయాలని కలెక్టర్ ఆదేశించారు. సోమవారం నిర్వహించిన పిజిఆర్ఎస్ కార్యక్రమంలో 276 అర్జీలు స్వీకరించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లా శాఖాధికారులు వారి శాఖలకు సంబంధించిన అర్జీలను క్షుణంగా పరిశీలించి తమ సిబ్బందితో నిర్ణీత గడువులోగా త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధశాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి

కేంద్ర భారీ పరిశ్రమల, ఉక్కు శాఖల సహాయ శాఖ మంత్రి భూపతి రాజు శ్రీనివాస్ వర్మ

విశాలాంధ్ర -భీమవరం: భారతీయ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సంక్రాంతి సంబరాలు విద్యార్థుల్లో నూతన ఉత్సాహాన్ని నింపుతాయని కేంద్ర భారీ పరిశ్రమల, ఉక్కు శాఖల సహాయ శాఖ మంత్రి భూపతి రాజు శ్రీనివాస్ వర్మ పేర్కొన్నారు.

సోమవారం ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన కేంద్రమంత్రి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సాంప్రదాయ సిద్ధమైన గంగిరెద్దులు నృత్యాలు, హరిదాసుల కథనాలు, భోగి మంటలు తెలుగువారి నోరూరించే రుచికరమైన వంటకాలు, కోలాటం నృత్యాలు తిలకించి పరవశించారు. ఇటువంటి కార్యక్రమాల వలన విద్యార్థుల్లో మన సంస్కృతి సంప్రదాయాలను మరొకసారి గుర్తు చేసేందుకు అవకాశం ఏర్పడుతుందన్నారు.

ఈ సందర్భంగా కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు సాగి ప్రసాదరాజు, సాగి రామకృష్ణ నిశాంతవర్మ మాట్లాడుతూ ప్రతి ఏటా తమ కళాశాలలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల ఉపాధ్యక్షులు ఎస్వీ రంగరాజు, డైరెక్టర్ సాగి సత్య ప్రతీక్ వర్మ, కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం. జగపతి రాజు, ప్రిన్సిపల్ డాక్టర్ కేవీ మురళీకృష్ణంరాజు, కళాశాల సిబ్బంది విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో సంక్రాంతి సంబరాలు

విశాలాంధ్ర - గణపవరం: గణపవరం శ్రీ చింతలపాటి వరప్రసాద మూర్తి రాజు ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ ఆధ్వర్యంలో సోమవారం సంక్రాంతి సంబరాలు ప్రారంభ మయ్యాయని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పాకలపాటి

నిర్మల కుమారి తెలిపారు. ఈ సంక్రాంతి సంబరాలు కార్యక్ర మాల్లో భాగంగా విద్యార్థులు సాంప్రదాయ వంటకాలు,మెహందీ పెట్టడం, సంక్రాంతి చిత్రాలను ప్రతిబింబించే విధంగా నిర్వహించడం జరిగిందన్నారు. అలాగే విద్యార్థులకు రేపు ముగ్గుల పోటీలు గాలిపటాల పోటీలు సాంప్రదాయ వస్త్రధారణ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ పి. మధు రాజు, ఐక్యు ఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ సిహెచ్ చైతన్య,అధ్యాపక బృందం డాక్టర్ టి.అక్కిరాజు, డాక్టర్ కే స్వరూప రాణి కోఆర్డినేటర్ ఉమెన్ ఎంపవర్మెంటల్, డాక్టర్ జి వి. శారదాదేవి, డాక్టర్ జి. వెంకటరమణ, షేక్ పర్వీన్ శ్రీపీ భాస్కరరావు, మోయిన్ అన్సారి, రాణిదుర్గ, విద్యార్థులు పాల్గొన్నారు.

కలుపు మందు తాగి వ్యక్తి మృతి

విశాలాంధ్ర-టి.నరసాపురం: కలుపు మందు తాగి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సాయంపాలెం గ్రామానికి చెందిన పులగర పిచ్చియ్యకు 13 సంవత్సరాల క్రితం వివాహమైంది. ఇద్దరు సంతానం. పిచ్చియ్య మద్యానికి బానిస కావడంతో 2 సంవత్సరాల క్రితం భార్య, పిల్లలతో కలిసి పుట్టింటికి వెళ్లిపోయింది. పిచ్చియ్య లో ఎంతకీ మార్పు రాకపోవడంతో ఈ నెల 3వ తేదీన మద్యం తాగివచ్చిన పిచ్చియ్య ను తల్లి మందలించడంతో కలుపు మందు తాగాడు. బంధువులు జంగారెడ్డిగూడెం ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు.

పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్చారు. చికిత్స పొందుతూ ఈ నెల 5వ తేదీన మృతి చెందాడు. తల్లి సుబ్బలక్ష్మి ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ ఎం. రాజు తెలిపారు.

దేశాభివృద్ధిలో రతన్ టాటా కీలకపాత్ర

విశాలాంధ్ర-కాళ్ళ : ఒక వ్యాపారవేత్తగా ఉండి కంట్రీఫస్ట్ అనే నినాదానికి కట్టుబడి చివరి వరకు పనిచేసిన వారు రతన్ టాటా అని రాష్ట్ర ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్, మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్ అన్నారు. పెద్ద అమిరంలో డిప్యూటీ స్పీకర్, శాసనసభ్యులు కనుమూరి రఘురామ కృష్ణంరాజు ఏర్పాటు చేసిన రతన్ టాటా విగ్రహ ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ కంపెనీల సమర్థతను ప్రపంచానికి చాటిన గొప్ప పారిశ్రామికవేత్త, విజనరీ రతన్ టాటా అన్నారు. ఇతర దేశాల కంపెనీలను కొనుగోలు చేసి విజయవంతంగా నడిపిన గొప్ప వ్యక్తి టాటా అని, టాటా కంపెనీ పేరు వినగానే ఒక గౌరవం, ఒక ఆదరణ, ఒక నమ్మకం కలుగుతుందని తెలిపారు. కోట్ల మంది విశ్వాసాన్ని పొందడం, దాన్ని దశాబ్దాలుగా కొనసాగించడం చిన్న విషయం కాదు అని . దీని వెనక ఎంతో దీక్ష, పట్టుదల, చిత్తశుద్ధి ఉందని పేర్కొన్నారు. ఉండి -జువ్వలపాలెంను కలిపే లింకు రోడ్డుకు రతన్ టాటా మార్గ్‌గా నామకరణం చేసి రూ.2.5 కోట్లతో అభివృద్ధి చేస్తున్నట్లు తెలియజేశారు. అహర్నిశలు దేశం కోసం శ్రమించిన రతన్‌టాటా విగ్రహం ఏర్పాటు చేసిన రఘు రామకృష్ణ రాజును ఆయన అభినందించారు. కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణం రాజు, రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టరు నిమ్మల రామానాయుడు, పశ్చిమ గోదావరి కలెక్టర్ చదలవాడ నాగరాణి, జిల్లా సూపరింటెం డెంట్ ఆఫ్ పోలీస్ అద్నాన్ నయీం అస్మి, జిల్లా పరిషత్ చైర్ పర్సన్ గంట పద్మశ్రీ, జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి, రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ పులపర్తి రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన పేదలకు ఇళ్ళ స్థలాలివ్వాలి

విశాలాంధ్ర - తాడేపల్లిగూడెం : ఎన్నికల ముందు ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు సొంత గృహం లేక అద్దెలు చెల్లించలేక తీవ్ర ఇబ్బందులెదుర్కొంటున్న నిరుపేదలకు ఇంటి స్థలాలు మంజూరు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు డిమాండ్ చేశారు. సోమవారం తాడేపల్లి గూడెం 24,25 వార్డులలో పేదలకు ఇళ్ళ స్థలాలు దరఖా స్తులు పంపిణీ చేసి దర ఖాస్తులు పూర్తి చేయించారు. ఈ సందర్భంగా భీమారావు మాట్లాడుతూ ఎన్నికల ముందు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇళ్ళు లేని పేదలకు పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు,గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు ఇంటి స్థలాలు కేటాయిస్తామన్న వాగ్దానం అమలు చేయాలని కోరారు. గత ప్రభుత్వం ఇచ్చిన జగనన్న నివేశన స్థలాల లబ్ధిదారులకు పట్టణాల్లో సెంటుకు బదులుగా 2 సెంట్లు,గ్రామాల్లో సెంటున్నరకు బదులు 3 సెంట్లు ఇస్తామన్న ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ నెరవేర్చాలని కోరారు. గృహ నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేయాలన్నారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.సీతారాం ప్రసాద్,తాడేపల్లిగూడెం సీపీఐ పట్టణ కార్యదర్శి మండల నాగేశ్వరరావు, వద్దాది మేరీ, నిమ్మకాయలు విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను మార్యాదపూర్వకంగా కలిసిన జిల్లా అటవీశాఖ అధికారి శ్రీశుభమ్

విశాలాంధ్ర-ఏలూరు: ఏలూరు జిల్లాకు జిల్లా అటవీశాఖ అధికారిగా శ్రీశుభమ్ బాధ్యతలు చేపట్టిన సందర్భంగా సోమవారం జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్విని మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి శ్రీశుభమ్‌కు అభినందనలు తెలిపారు. అన్నమయ్య జిల్లా రైల్వే గూడూరు సబ్ డివిజన్ నుండి బదిలీపై ఏలూరు జిల్లా అటవీశాఖ అధికారిగా బాధ్యతలు చేపట్టారు.

ఏరియా ఆస్పత్రి సిబ్బంది వేతన బకాయిలు చెల్లించాలి

ఏఐటీయూసీ ధర్నా

విశాలాంధ్ర-తాడేపల్లిగూడెం: నాలుగు నెలల వేతన బకాయిలు చెల్లించాలని కోరుతూ ఏరియా ఆస్పత్రిలో పారిశుద్ధ్య, సెక్యూరిటీ విభాగాల కాంట్రాక్ట్ సిబ్బంది సోమవారం ఆస్పత్రి ప్రధాన ద్వారం ఎదుట ధర్నా నిర్వహించారు. జీతాల బకాయిలు చెల్లించాలని, పి.ఎఫ్. బకాయిలు జమ చేయాలని, సిబ్బందికి యూనిఫారంలు, పరికరాలు, పని సామాన్లు ఇవ్వాలని కార్మికులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఆంధ్రప్రదేశ్ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన ధర్నానుద్దేశించి ఏఐటీయూసీ ఏరియా కమిటీ అధ్యక్షుడు ఓసూరి వీర్రాజు మాట్లాడుతూ బడుగు, బలహీనవర్గాలకు చెందిన కార్మికులే ఏరియా ఆసుపత్రిలో పారిశుధ్య , సెక్యూరిటీ పనులకు వస్తున్నారని, వారికి నెలల తరబడి జీతాలు ఇవ్వకపోతే వారెలా బతుకుతారని ప్రశ్నించారు.ప్రతిసారీ జీతాల కోసం ధర్నా చేయాల్సి రావడం తమకు సిగ్గుగా ఉందన్నారు.ఏరియా ఆస్పత్రుల్లో పనిచేసే సిబ్బందిని ఆప్కాస్‌లో చేర్చి వేతనాలు క్రమం తప్పకుండా వచ్చేటట్లు చూడాలని వీర్రాజు డిమాండ్ చేశారు. ఏరియా కమిటీ ఆర్గనైజింగ్ కార్యదర్శి కె. లక్ష్మీనారాయణ మాట్లాడుతూ కార్మికుల కృషితోనే ఆస్పత్రికి వివిధ విభాగాల్లో రాష్ట్రస్థాయిలో అవార్డులు వస్తున్నాయని,అయినా వారికి వేతనాలు సరిగ్గా చెల్లించక పోవడం బాధారమని, కాంట్రాక్ట్ సిబ్బందికి పి.ఎఫ్ సమస్యలు కూడా పరిష్కారం కావడం లేదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ తాతారావుకు సమస్యలపై వినతిపత్రం అందజేశారు.

ఏరియా కమిటీ కార్యదర్శి మందలపర్తి హరీష్, మునిసిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కోశాధికారి తాడికొండ శ్రీనివాసరావు తదితరులు మాట్లాడారు. ధర్నా కార్యక్రమానికి యూనియన్ నాయకులు కుమారి, జి.సురేష్, వెంకటలక్ష్మి, నాగేంద్ర, తదితరులు నాయకత్వం వహించారు.

ఐఎఎల్ డైరీ ఆవిష్కరణ

విశాలాంధ్ర -భీమవరం: ఐఎఎల్ రూపొందించిన డైరీలు న్యాయవాదులకు, పోలీసులకు, ప్లీడర్ గుమాస్తాలకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని, కోర్టు వాయిదాలు పోస్టింగ్ వేయడానికి ఉపకరిస్తుం దని ఐఎఎల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చెల్లబోయిన రంగారావు అన్నారు. ఐఎఎల్ రూపొందించిన కోర్టు డైరీ-2025లను కోర్టు ప్రాంగణంలో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐఎఎల్ ఎన్నో వ్యయ ప్రయాసలకు ఓర్చి రూపొందించిన డైరీలో సమస్త విషయాలు పొందుపరచబడ్డాయని ప్రతి ఒక్కరూ డైరీని కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏలేటి న్యూటన్, ఐఎఎల్ నాయకులు వై.వి.ఆనంద్, కామన రామకృష్ణ, అద్దంకి రాజేష్, గుంటి ప్రభు తదితరులు పాల్గొన్నారు.

యూనిట్‌గా ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వాలి

విశాలాంధ్ర - కుక్కునూరు : కుక్కునూరు మండలం మొత్తాన్ని యూనిట్ గా తీసుకొని ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని సిపిఐ మండల కార్యదర్శి మైసాక్షి వెంకటాచారి డిమాండ్ చేశారు. స్థానిక సిపిఐ కార్యాలయంలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో వెంకటాచారి మాట్లాడారు. ప్రతి ఏటా వర్షాకాలంలో సంభవించే ఇటు గోదావరి వరద అటు శబరి ఉధృతికి కుక్కునూరు మండల ఏజెన్సీ మొత్తం వరదల్లో అతలాకుతలం అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. వరద ముంపును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం మండలం మొత్తాన్ని యూనిట్‌గా తీసుకొని ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని ఆయిన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.2015లో అప్పటి టిడిపి ప్రభుత్వం రూ.6 లక్షల పైచిలుకు ప్యాకేజీ ప్రకటించదని, కాగా గత జగన్ ప్రభుత్వం రూ. 10 లక్షల ప్యాకేజీ ఇవ్వాలని నిర్ణయించిందని పేర్కొన్నారు. 41.15 కాంటూరులో ముంపులో ఉన్న గ్రామాలకు కేవలం గిరిజనులకు రూ.6.80 లక్షలు, గిరిజనేతరులకు రూ. 6.36 లక్షలు ఇచ్చి ప్రభుత్వం చేతులు దులుపుకొందని విమర్శించారు. 41.15కాంటూరు లెవల్‌లో మండలం మొత్తం వరదలకు మునుగు తుందని..ప్రభుత్వం మిగిలిన అన్ని గ్రామాలకు తక్షణమే ప్యాకేజీ ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. కాగా నేటికీ 18 ఏళు నిండిన ప్రతి ఒక్క రికీ ప్యాకేజీ వర్తింప చేయాలని,నష్టపోయిన ప్రతి నిర్వాసిత కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారం కాని పక్షంలో సిపిఐ ఆధ్వర్యంలో పోరాటం మరింత ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో సిపిఐ ఏలూరు జిల్లా సమితి సభ్యులు కొన్నె లక్ష్మయ్య, కూరాకుల బాబూరావు పాల్గొన్నారు.

నేటి నుంచి ఏపీఈఆర్సీ ప్రజాభిప్రాయ సేకరణ

విశాలాంధ్ర -భీమవరం: 2025-26 ఆర్థిక సంవత్సరానికి అమలు చేయనున్న విద్యుత్ చార్జీల(టారిఫ్) ప్రతిపాదనలపై జనవరి ఏడు, ఎనిమిది, పది తేదీల్లో ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్సీ) ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఏపీఈపీడిసి ఎల్ సూపరింటెండింగ్ ఇంజనీర్, ఎ.రఘునాథబాబు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు విద్యుత్ పంపిణీ సంస్థలు ఏపీఈఆర్సీకి సమర్పించిన వార్షిక ఆదాయ అవసరాల నివేదిక(ఎఆర్‌ఆర్)పై ఏడు, ఎనిమిది తేదీల్లో విజయవాడ బృందావన్ కాలనీలోని 'ఏ' కన్వెన్షన్ సెంటర్ నుంచి, పదవ తేదీన కర్నూలు ఏపీఈఆర్సీ కార్యాలయంలో ప్రతిరోజు ఉదయం 10.30 గంటల నుంచి ఒంటిగంట వరకు నేరుగానూ, రెండు గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జరగనున్న ప్రజాభిప్రాయ సేకరణలో వినియోగదారులు అభ్యంతరాలు, అభిప్రాయాలను వెల్లడించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఈఆర్సీ అధికారులతో పాటు ఆంధ్రప్రదేశ్ ఇంధనశాఖ, ఏపీట్రాన్స్కో, ఏపీజెన్కో, ఏపీఈపీడీసీఎల్, ఏపీఎస్పీడీసీఎల్, ఏపీసీపీడీసీఎల్ అధికారులు పాల్గొంటారని ఆయన తెలిపారు.

వసతి గృహాల మరమ్మతులకు నిధులు మంజూరు

- సర్వసభ్య సమావేశంలో అధికారుల వెల్లడి
- వసతి గృహాల అభివృద్ధికి చర్యలు తీసుకోవడంతో సభ్యుల హర్షం

విశాలాంధ్ర - లింగపాలెం : లింగపాలెం మండలంలోని సాంఘిక సంక్షేమ వసతి గృహాల మరమ్మతులకు ప్రభుత్వం రూ.55 లక్షలు కేటాయించిందని పంచాయతీరాజ్ అసిస్టెంట్ ఇంజనీర్ జగన్నాధరావు వెల్లడించారు. వసతి గృహాలలో నెల కొన్న సమస్యలతో విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను జనరల్‌బాడీ సమావేశంలో పలుమార్లు ప్రస్తావించారు. ఈ ప్రభుత్వం వీటి మరమ్మతుల కోసం ధర్మాజీగూడెం బాలుర వసతి గృహానికి రూ.27 లక్షలు, ధర్మాజీ గూడెం బాలికల వసతి గృహానికి రూ.19 లక్షలు, సింగగూడెం వసతి గృహానికి రూ.9లక్షలు మరమ్మతులకు నిధులు మంజూరు చేశారు. వీటి మరమ్మతులకు నిధులు మంజూరు చేయటంతో సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. లింగపాలెం మండల సర్వసభ్య సమావేశం మండల పరిషత్ అధ్యక్షురాలు ముసునూరు వెంకటలక్ష్మి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో వివిధ అంశాలపై చర్చించారు. మండలంలో డ్రైన్లు మరమ్మతులకు రూ.1.47 కోట్లు మంజూరు చేశారని, డ్రైన్‌లను మరమ్మతులు చేయడం సాధ్యపడదని పరిశీలించి వీటి స్థానంలో సీసీ రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం ఆమోదం ఇచ్చిందని పంచాయతీరాజ్ ఏఈ తెలిపారు. ఈ నిధులతో మండలంలో దాదాపు మూడు కిలోమీటర్ల మేర సిమెంట్ రహదారులు నిర్మిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. మండలంలోని గ్రామీణ ప్రాంతాల రహదారులపై దమ్ము చక్రాలను తిప్పటం వల్ల రహదారులు దెబ్బతింటున్నాయని వీటిని నివారించాలని యడవల్లి సర్పంచ్ రమేష్ సమావేశంలో చర్చించారు. రహదారుల మార్జిన్లను ఆక్రమించుకోవడం వల్ల ప్రయాణాలకు ఇబ్బంది కలుగుతుందని, వీటిని తొలగించాలని కోరారు. వీటిని తొలగించే బాధ్యత ఎవరికి ఉందంటూ అధికారులను ఈయన ప్రశ్నించారు. దీనిపై తహసిల్దార్ నజీమ్ మాట్లాడుతూ ఆక్రమణల తొలగింపు, దమ్ము చక్రాల నివారణ బాధ్యత పంచాయతీలకు ఉందని తెలిపారు. ఆక్రమణల వల్ల ఇబ్బందులు ఉంటే వీటిని గ్రామపంచాయతీ అధికారులు తొలగించవచ్చన్నారు. గ్రామంలో పనిచేసే రెవెన్యూ సిబ్బంది సహకారం తీసుకోవచ్చని అన్నారు. వీటిపై ముందుగా ప్రజలకు అవగాహన కల్పించాలని తహసిల్దార్ వివరించారు. లింగపాలెం మండలంలో గృహాలు మంజూరైన వారంతా మార్చి నెలాఖరుకల్లా నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని ఎంపీడీవో వాణి తెలిపారు. ఇళ్లను నిర్మించుకోలేక పోతే వాటిని రద్దు చేస్తారని వివరించారు. సమావేశంలో ఉపాధి హామీ, వ్యవసాయం, విద్య, గ్రామీణ తాగునీటి పథకాలపై చర్చించారు. సమా వేశంలో మండల పరిషత్ ఉపాధ్యక్షులు మట్టా సురేష్, కె.ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆర్డీవో కార్యాలయం ఎదుట సీపీఐ ధర్నా

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం: భారత కమ్యూనిస్టుపార్టీ బుట్టాయి గూడెం మండల కార్యాలయాన్ని తహశీ ల్దార్ అక్ర మంగా కూల్చి వేయడాన్ని నిరసిస్తూ 7వ తేదీ మంగళవారం జంగారెడ్డిగూడెం రెవెన్యూ డివిజన్ అధికారి కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించాలని వామపక్షాలు పిలుపు ఇచ్చాయని, వామపక్ష పార్టీల కార్యకర్తలు, నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని తహశీల్దార్ నియంత పోకడలను ఎండగట్టాలని సిపిఐ జంగారెడ్డిగూడెం మండల కార్యదర్శి జంపన వెంకటరమణ రాజు కోరారు . సోమవారం ఆయన జంగారెడ్డిగూడెం లోని సిపిఐ కార్యాలయంలో మాట్లాడుతూ గత నెల 27 వ తేదీన బుట్టాయగూడెం మండల కార్యాలయమును పార్టీ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణతో ప్రారంభించుకోవడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసు కున్న తరుణంలో,పార్టీ శ్రేణులు 26వ తేదిన పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఆనందోత్సాహాలతో జరుపుకుంటుండగా బూర్జువా పార్టీల అండదండలతో బుట్టాయగూడెం మండల తహశీల్దార్ అక్రమంగా పేదలు బడుగు,బలహీన వర్గాలు, ఆదివాసీ గిరిజనులు తమ కష్టార్జితంతో నిర్మాణం పూర్తి చేసుకున్న పార్టీ కార్యాలయాన్ని పోలీసు బందోబస్తుతో జెసిబితో కూల్చి వేశారన్నారు.పైగా పంచాయతీ కామన్ సైట్ అని, అందుకే కూల్చి వేశామని, తహశీల్దార్ చెబుతున్నారని ,అది అవాస్తవమని ఆయన అన్నారు. పోలవరం నియోజకవర్గంలో కమ్యూనిస్టు పార్టీ ఎదుగు దలను చూసి ఓర్వలేని బూర్జువా రాజ కీయ శక్తులతో ఎమ్మార్వో చేతులు కలిపి పార్టీ కార్యాలయాన్ని కూల్చారని ఆయన విమర్శించారు. అక్రమంగా కమ్యూనిస్టు పార్టీ సిపిఐ కార్యాలయాన్ని కూల్చివేసిన తహసీల్దారును సస్పెండ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో సిపిఐ, సిపిఎం, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీల ఆధ్వర్యంలో నిర్వహించినట్టు ఆయన తెలిపారు.

బ్యాంకు ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రాంతీయ ప్రధాన కార్యదర్శిగా లక్ష్మణరావు

విశాలాంధ్ర - ఏలూరు : ఆంధ్రప్రదేశ్ యూనియన్ బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసి యేషన్ ఏలూరు రీజియన్ ప్రధాన కార్యదర్శిగా ఎన్.లక్ష్మణరావు ఎన్నికయ్యారు. ఏలూరు గిరిజన భవనంలో ఆదివారం ఆంధ్రప్రదేశ్ యూనియన్ బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఏలూరు రీజియన్ ద్వైవార్షిక సమావేశం జరిగింది. సమావేశం ఏలూరు రీజియన్‌కు ప్రధాన కార్యదర్శిగా ఎన్.లక్ష్మణరావును, డిప్యూటీ రీజినల్ కార్యదర్శిగా బావనరుషి, దివ్య రజిని,కోశాధికారిగా ఎస్.కె. ఉస్మాన్,అసిస్టెంట్ కార్యదర్శిగా ఎస్. చంద్రశేఖర్ మరో 10 మంది కమిటీ సభ్యులను సమావేశం ఏకగ్రీవంగా ఎన్నుకుంది.

ఏలూరు రీజియన్ నుంచి యూనియన్ బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ కార్యకర్తలు 300 మంది పాల్గొన్నారు.ఈ సమావేశంలో యూనియన్ బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కాలే శ్రీనివాసరావు, ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ బి.రాంబాబు, యూనియన్ బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి. ఉదయ్ కుమార్ తదితరులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరి స్తున్న బ్యాంకుల ప్రైవేటీకరణ విధానాలపై ధ్వజమెత్తారు.

ఈ సమావేశంలో యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ టి. రవీంద్రనాథ్, యూనియన్ బ్యాంక్ ఏలూరు రీజినల్ హెడ్ ఎన్. శ్రీనివాస్ తదితరులు మాట్లాడారు. సమావేశం నిర్ణయాలను సోమవారం యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎన్. లక్ష్మణరావు మీడియాకు వివరించారు.

తుది ఓటర్ల జాబితా విడుదల

జిల్లాలో 16,37,555 ఓటర్లు

విశాలాంధ్ర-ఏలూరు: భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రత్యేక సంక్షిప్త సవరణ 2025 షెడ్యూల్ ప్రకారం ఏలూరు జిల్లాకు సంబంధించిన తుది ఓటర్ల జాబితాను సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి విడుదల చేశారు. నియోజకవర్గం వారీగా మొత్తం ఓటర్లు, సర్వీసు ఓటర్ల వివరాలను అందులో పొందుపర్చారు. జిల్లాలో 16,37,555 మంది ఓటర్లు ఉన్నార న్నారు. ఇందులో పురుష ఓటర్లు 7,99,283 మంది, మహిళా ఓటర్లు 8,38,146 మంది, థర్డ్ జెండర్ ఓటర్లు 126 మంది ఉన్నారన్నారు. వీరుగాక 678 మంది సర్వీసు ఓటర్లుగా నమోదైవున్నారన్నారు. జిల్లాలోని ఉంగుటూరు నియోజకవర్గంలో 1,01,586 మంది పురుష ఓటర్లు, 1,04,914 మంది మహిళా ఓటర్లు, 06 మంది థర్డ్ జెండర్ ఓటర్లు కలిపి మొత్తం 2,06,506 మంది ఓటర్లు ఉన్నారన్నారు. మరో 193 మంది సర్వీసు ఓటర్లుగా ఉన్నారు. దెందులూరు నియోజకవర్గంలో 1,09,181 మంది పురుష ఓటర్లు, 1,15,318 మంది మహిళా ఓటర్లు, 08 మంది థర్డ్ జెండర్ ఓటర్లు కలిపి మొత్తం 2,24,507 మంది ఓటర్లు ఉన్నారన్నారు. మరో 101 మంది సర్వీసు ఓటర్లుగా ఉన్నారు.ఏలూరు నియోజకవర్గంలో 1,12,032 మంది పురుష ఓటర్లు, 1,22,447 మంది మహిళా ఓటర్లు, 47 మంది థర్డ్ జెండర్ ఓటర్లు కలిపి మొత్తం 2,34,526 మంది ఓటర్లు ఉన్నారన్నారు. మరో 115 మంది సర్వీసు ఓటర్లుగా ఉన్నారు. పోలవరం(ఎస్టీ) నియోజకవర్గంలో 1,22,961 మంది పురుష ఓటర్లు, 1,31,381 మంది మహిళా ఓటర్లు, 09 మంది థర్డ్ జెండర్ ఓటర్లు కలిపి మొత్తం 2,54,351 మంది ఓటర్లు ఉన్నారన్నారు. మరో 68 మంది సర్వీసు ఓటర్లుగా ఉన్నారు. చింతలపూడి(ఎస్సీ) నియోజకవర్గంలో 1,34,171 మంది పురుష ఓటర్లు, 1,38,705 మంది మహిళా ఓటర్లు, 41 మంది థర్డ్ జెండర్ ఓటర్లు కలిపి మొత్తం 2,72,917 మంది ఓటర్లు ఉన్నారన్నారు. మరో 72మంది సర్వీసు ఓటర్లుగా ఉన్నారు. నూజివీడు నియోజకవర్గంలో 1,18,055 మంది పురుష ఓటర్లు, 1,20,868 మంది మహిళా ఓటర్లు, 10 మంది థర్డ్ జెండర్ ఓటర్లు కలిపి మొత్తం 2,38,933 మంది ఓటర్లు ఉన్నారన్నారు. మరో 50 మంది సర్వీసు ఓటర్లుగా ఉన్నారు. కైకలూరు నియోజకవర్గంలో 1,01,297 మంది పురుష ఓటర్లు,1,04,513 మంది మహిళా ఓటర్లు,05 మంది థర్డ్ జెండర్ ఓటర్లు కలిపి మొత్తం 2,05,815 మంది ఓటర్లు ఉన్నారన్నారు. మరో 79 మంది సర్వీసు ఓటర్లుగా ఉన్నట్లు తెలిపారు.

అద్దేపల్లి జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శం

కేంద్రమంత్రి శ్రీనివాసవర్మ

విశాలాంధ్ర - పాలకొల్లు : స్వాతంత్ర సమరయోధునిగా, విద్యాదాతగా, సేవా మూర్తిగా, అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ఆదర్శనీయులని కేంద్రమంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ, రాష్ట్ర మంత్రులు డాక్టరు నిమ్మల రామానాయుడు, టి.జి భరత్, సినీ సంగీత దర్శకులు ఆర్.పి.పట్నాయక్ అన్నారు. పాలకొల్లులో ధర్మారావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంత్రి రామానాయుడు సారథ్యంలో నిర్వహించిన అద్దేపల్లి జయంతి ముగింపు సభలో, వీరు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ముందుగా అద్దేపల్లి విగ్రహానికి, చిత్రపటానికి కేంద్ర, రాష్ట్ర మంత్రులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని మంత్రి టి.జి. భరత్ ప్రారంభించారు. సభకు అధ్యక్షత వహించిన మంత్రి నిమ్మల రామా నాయుడు మాట్లాడుతూ స్వాతంత్ర్య సమర యోధునిగా, విద్యా దాతగా, సేవా మూర్తిగా అద్దేపల్లి అందరికీ ఆదర్శనీయులని, సుపరిచితులని అన్నారు. అటువంటి మహనీయుని చరిత్రను భావితరాలతో పాటు, భవిష్యత్తు తరాలకు అందించాలనే ఉద్దేశంతోనే ఏడాది పాటు జయంతి ఉత్సవాలను నిర్వహించినట్లు తెలిపారు. మంత్రి టి.జి.భరత్, అద్దేపల్లి గురించి మాట్లాడుతూ ఇటువంటి గొప్ప వ్యక్తుల చరిత్రలను పిల్లలకు తెలిసేలా ప్రతి తల్లిదండ్రులు చెప్పాలన్నారు. అద్దేపల్లిని ఆదర్శంగా తీసుకుని ప్రతి ఒక్కరూ తమకున్న స్తోమతను బట్టి సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలన్నారు. సినీ సంగీత దర్శకులు ఆర్‌పి పట్నా యక్ మాట్లాడుతూ అద్దేపల్లి జయంతి వేడుకల్లో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. మంత్రి రామానాయుడును చూడాలనే ఈ కార్యక్రమానికి హాజరైనట్లు తెలిపారు. అందుకు గల కారణాన్ని వివరిస్తూ.. ఎన్నికల ముందు తన స్నేహితుడు ఒకరు ఎవరు గెలిచినా గెలవకపోయినా నిమ్మల రామానాయుడు గెలుస్తారంటూ గంటా

పదంగా చెప్తుండే వాడన్నారు. ఎన్నోసార్లు రామానాయుడు చేసే మంచి కార్యక్రమాలు కూడా తెలుసుకొని ఎప్పుడైనా స్వయంగా కలవాలి, చూడాలి, మాట్లాడాలి అనుకున్నానని, తన ఆశ ఈరోజు ఇలా నెరవేరిందన్నారు. సభా కార్యక్రమంలో భాగంగా, మంత్రులు శ్రీనివాస్ వర్మ, భరత్, ఆర్పి పట్నాయక్ లను మంత్రి రామానాయుడు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో మాజీ శాసన మండలి సభ్యులు అంగర రామ్మో హన్, మాజీ శాసనసభ్యులు బంగారు ఉషారాణి, రాష్ట్ర జనసేన పార్టీ ప్రచార కమిటీ చైర్మన్, సినీ నిర్మాత గవర ఉదయ శ్రీనివాసు (బన్నివాసు), బిజెపి కృష్ణాజిల్లా ఇంచార్జి ఉన్నమట్ల కబర్ధి తదితరులు పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, ADDALA SNEHAL (New Name), W/O ADDALA MANIKANTA, Previously Called RAO SNEHAL MURLI (Old Name), Resident of D.No:1-145/2, Mallamma Veedhi, Chinamiram Village, Bhimavaram Mandal, W.G.Dt., Pin:534204, Andhrapradesh. I have changed my name from RAO SNEHAL MURLI (Old Name) To ADDALA SNEHAL (New Name) for all practical purposes.

కానిస్టేబుల్ పరీక్షల్లో 253 మంది ఉత్తీర్ణత

విశాలాంధ్ర ప్రతినిధి- ఏలూరు : గత కొద్ది రోజులుగా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిధిలో రాత పరీక్షలో ఎంపికైన కానిస్టేబుల్ అభ్యర్థులకు ఏలూరులోని పోలీస్ పెరేడ్ గ్రౌండ్లో జరుగుతున్న దేహదారుఢ్య పరీక్షలను ప్రశాంత వాతావరణంలో అత్యంత పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివ కిషోర్ చెప్పారు. సోమవారం ఏలూరు జిల్లా మహిళా పోలీస్ కానిస్టేబుల్ దేహ ధారుఢ్య పరీక్షలు ఎస్పీ పర్యవేక్షణలో ప్రారంభించారు. మహిళా దేహధారుఢ్య పరీక్షల నిర్వహణ కోసం అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం, సీసీ.టీవీ పర్యవేక్షణ, డ్రోన్ కెమేరాల ద్వారా నిష్పక్ష పాతంగా పోలీసు అధికారుల సమక్షంలో నిర్వహించారు. ఇందులో భాగంగా ఏపిఎస్ ఎల్పిఆర్బీ 600 మంది అభ్యర్థులకు హాల్ టికెట్ ఇవ్వగా 396 మంది హాజరు కావడంతో 253 మంది అభ్యర్థులు ఉత్తీర్ణులయ్యారు. ఏబిఓఎస్టి కమ్యూనిటీ సర్టిఫికెట్లను దేహదారుఢ్య పరీక్షలకు హాజ రయ్యే అభ్యర్థులు తప్పనిసరిగా తీసుకురావాలని ఎస్పీ స్పష్టం చేశారు. అప్పీల్ చేసుకున్న అభ్యర్థులు ఈ నెల 9వతేదీన నిర్వహించే దేహ దారుఢ్య పరీక్షలకు తప్పనిసరిగా హాజరుకావాలని ఎస్పీ కిషోర్ చెప్పారు.

జూదాలలో పాల్గొంటే చట్టపరమైన చర్యలు

విశాలాంధ్ర- కలిదిండి : పేకాట, కోడిపందాలు తదితర జూదాలలో పాల్గొన్న వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై వి.వెంకటేశ్వరరావు తెలిపారు. సోమ వారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో గ్రామ కమిటీల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గ్రామాలలో సంక్రాంతి సందర్భంగా కోడి పందాలు, పేకాట వంటి జూదాలకు ప్రజలు దూరంగా ఉండాలని తెలిపారు. సంక్రాంతి సందర్భంగా కబడ్డీ, క్రికెట్, వాలీబాల్ వంటి క్రీడలను నిర్వహించి క్రీడల్లో పాల్గొనాలని తెలిపారు. గ్రామ కమిటీలతో కలసి గ్రామాలలో జూదాలకు తావు ఇవ్వకుండా చర్యలు చేపడుతున్నామన్నారు. జూదాలలో పాల్గొన్న వ్యక్తులపై చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

పీసా ఎన్నికల సందర్భంగా అవగాహన

విశాలాంధ్ర - బుట్టాయిగూడెం: మండలంలో పీసా గ్రామసభ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో మండలంలోని దొరమామిడి, జైనవారిగూడెం పంచాయతీ పరిధిలో ఆ గ్రామాల కార్యదర్శి జె. కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బంది సోమవారం అవగాహన కార్యక్ర మాలు నిర్వహించారు. ఈ మేరకు పీసా గ్రామసభ ఎన్నికల కరపత్రాలను పంపిణీ చేసి ప్రజలకు ఎన్నికలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఉపాధ్యక్ష, కార్యదర్శి ఎంపికకు సంబంధించి దొరమామిడి పంచాయతీలో 7న, జైనవారిగూడెం పంచాయతీలో 8వ తేదీన ఎన్నికల నిర్వహణ జరుగుతుందని, ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరు తప్పక ఓటు హక్కును వినియోగించుకొని పంచాయతీ అభివృద్ధికి సహకరించాలని ఆయన కోరారు.

బాధితులకు సాయం

విశాలాంధ్ర-దేవరపల్లి: ఆపదలో ఉన్న వారిని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తక్షణం ఆదుకుంటుందని గోపాలపురం నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి ఇంచార్జ్ మాజీ మంత్రి తానేటి వనిత, దేవరపల్లి ఎంపీపీ కేవీకే దుర్గారావు పేర్కొన్నారు. దేవరపల్లి మండలం దుమంతునిగూడెం పంచాయతీ సుబ్బరాయపురంలో అగ్ని బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి తానేటి వనిత మాట్లాడుతూ తమ పార్టీ అధినేత వైయస్ జగన్మోహన్‌రెడ్డి ఆదర్శంగా తీసుకుని ఆపదలో ఉన్న వారిని తక్షణం ఆదుకుంటున్నాము అన్నారు సుబ్బరాయపురంలో శనివారం మూడు తాటాకు ఇల్లు దగ్ధమయ్యాయన్నారు. అగ్ని బాధితులైన చాపల చంద్రమ్మ, మంద నిర్మల, మంద రామారావు కుటుంబాలకు ఒక్కొక్క బస్తా బియ్యం, ఐదు వేల రూపాయల నగదు, కూరగాయలు నిత్యవసర వస్తువులు అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా అగ్ని బాధిత కుటుంబాలకు మాజీ మంత్రి వనిత ఎంపీపీ కేవీకే దుర్గారావు సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవరపల్లి మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కూచిపూడి సతీష్ వైసీపీ నేతలు పచ్చ రాంగోపాల్ కరుటూరి నిత్యానందం కడలి ఐమావతి స్థానిక వైసీపీ నేతలు సత్తి జగదీశ్వర్ రెడ్డి సత్తి సాయి ఈశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌లో అర్జీల స్వీకరణ

విశాలాంధ్ర -కొవ్వూరు : ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ప్రతి మండల తహసీల్దార్ కార్యాలయంలో జరుగుతుందని ప్రజలు తమ అర్జీలను అక్కడ అంద చేయాలని రెవెన్యూ డివిజన్ అధికారి రాణి సుస్మిత పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో 'పి జి ఆర్ ఎస్ -మీ కోసం వేదిక లో ఆర్డీవో అర్జీలను స్వీకరించారు. ప్రతి అర్జీని నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కరించి దరఖాస్తు దారునికి తగిన న్యాయం చేయాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి ..మరొకరికి గాయాలు

విశాలాంధ్ర- పెరవలి : సోమవారం రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందగా మరొక వ్యక్తి గాయాలపాలైన ఘటన ఖండవల్లిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సోమవారం ఉదయం 10.30 గం సమయంలో పెరవలి మండలం ఖండవల్లి గ్రామానికి చెందిన పెదపూడి శక్తి గణేష్ కుమార్ (25) అతను తన స్నేహితుడు చేచేర్ల వినయ కుమార్తో కలసి ద్విచక్ర వాహనంపై తణుకు నుంచి ఖండవల్లి జాతీయ రహదారి వెంబడి వస్తుండగా ఖండవల్లి సమీపంలో రవళి స్పినింగ్ మిల్లు వద్ద ట్రాఫిక్ ఎడమ వైపుకు మళ్లించగా కారును తప్పించే క్రమంలో అదుపు తప్పి రోడ్డు ప్రక్కన ఉన్న సైన్ బోర్డుని ఢీకొని శక్తి గణేష్ కుమార్ అక్కడికక్కడే మృతి చెందగా, చేచేర్ల వినయ కుమార్‌కు గాయాలు కావడంతో వైద్యం నిమిత్తం తరలించారు. పెరవలి ఏఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మహిళా సాధికారత ప్రభుత్వ లక్ష్యం

విశాలాంధ్ర -కొవ్వూరు : మహిళా సాధికారతకు కూటమి ప్రభుత్వం పని చేస్తుందని కొవ్వూరు శాసనసభ్యులు ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం కొవ్వూరు పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వెనుక ఉన్న సచివాలయంలో రోటరీ క్లబ్ ఐకాన్ రాజమహేంద్రవరం సహకారంతో మహిళలకు టైలరింగ్‌పై ఉచిత శిక్షణ అందించి కుట్టుమిషన్లను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కుటుంబ అభివృద్ధిలో మహిళపాత్ర గణనీయమైనదని, మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని లక్ష్యంతో ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు డ్వాక్రా రుణాలను అందించి మహిళలకు ఆర్థిక భరోసాను కల్పిస్తున్నారన్నారు. మహిళలు అన్ని రంగాలలోనూ రాణించాలని కోరారు. రోటరీ క్లబ్ ఐకాన్ రాజమహేంద్రవరం సహకారంతో కొవ్వూరు పట్టణంలో పేద కుటుంబాల్లోని మహిళలకు టైలరింగ్‌పై శిక్షణ కల్పించి ఉచితంగా హైడ్రాలిక్ కుట్టుమిషన్లు అందించడం జరిగిందన్నారు. రానున్న రోజుల్లో మహిళా స్వయం ఉపాధిలో భాగంగా

మరిన్ని కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు ఈ కార్యక్రమంలో కొవ్వూరు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణ, మాజీ మున్సిపల్ చైర్పర్సన్ సూరపనేని చిన్ని, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు సూర్యదేవర రంజిత్ కుమార్, కొవ్వూరు పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు దాయన రామకృష్ణ, కోపరేటివ్ అర్బన్ బ్యాంక్ అధ్యక్షులు మద్దిపట్ల శివరామకృష్ణ, జనసేన కొవ్వూరు నియోజకవర్గం ఇంచార్జ్ మాజీ ఎమ్మెల్యే టీవీ రామారావు, మరిశెట్టి వెంకటేశ్వరరావు, భారతీయ జనతా పార్టీ నాయకులు బోడపాటి ముత్యాలరావు, కొవ్వూరు మండల బీజేపీ అధ్యక్షులు దేగల సునీత, రోటరీ క్లబ్ ఆఫ్ రాజమహేంద్రవరం ఐకాన్ సభ్యులు పాల్గొన్నారు

సమస్యలపై గళం

విశాలాంధ్ర - జగ్గంపేట : మండల పరిషత్ బడ్జెట్ సమావేశంలో సభ్యులు సమస్యలపై గళమెత్తారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీపీ అత్తులూరి నాగబాబు అధ్యక్షతన బడ్జెట్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో అధికారులు వారి పనితీరు గురించి వివరించారు. సమావేశంలో విద్యుత్ సమస్యలను సభ్యులు ప్రస్తావించారు. ఎరువులు, విత్తనాల పంపిణీ చేయడంతో వ్యవసాయ అధికారులు అలసత్వం వహిస్తున్నారని రామవరం ఎంపిటిసి దొడ్డ శ్రీను ధ్వజమెత్తారు. అర్బికెలు ఉన్నా ఎందుకు అందుబాటులో ఉంచడంలేదని ప్రశ్నించారు. జెడ్పీటీసీ ఓమ్మి బిందుమాధవి, మండలంలోని ఎంపిటిసి సభ్యులు, సర్పంచ్లు, ఐసిడిఎస్ సీడీపీఓ పూర్ణిమ, ఎంపిడిఓ ఏవిఎస్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఓర్వలేక తప్పుడు ఆరోపణలు: ఎమ్మెల్యే

విశాలాంధ్ర - రావులపాలెం : అభివృద్ధిని చూసి ఓర్వలేక మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు మండిపడ్డారు. రావులపాలెం క్యాంపు కార్యాలయం వద్ద ఆయన విలేకరులతో మాట్లాడుతూ అవినీతి పితామహులు రాష్ట్రంలో మాజీ ముఖ్యమంత్రి జగన్ రెడ్డి, కొత్తపేటలో చిర్ల జగ్గిరెడ్డి అని విమర్శించారు. ప్రజలకు ఇసుకను ఉచితంగా పంపిణీ చేస్తుంటే అవినీతి పితామహుడు జగ్గిరెడ్డి ఇసుకలో అవినీతి జరిగిందనడం సిగ్గుచేటన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో నదులలో ఇసుకను అక్రమంగా తరలించి కోట్లు గడించడమే కాకుండా అనుమతులకు విరుద్ధంగా నదులలో చెరువులను తలపించేలా ఇసుక తవ్వకాలు చేసి ఇద్దరు యువకులు ప్రాణాలు కోల్పోవడానికి కారణమయ్యారని ఆరోపించారు. ప్రజలకు ఉచితంగా ఇసుకను సరఫరా చేయాలని ప్రభుత్వం కొత్త పాలసీ తీసుకు వచ్చిందని అందులో లోటుపాట్లు ఉంటే విమర్శనాత్మకంగా స్పందిస్తే సరిచేసుకుంటామని అదుపుతప్పి మాట్లాడితే మాత్రం సహించేది లేదని హెచ్చరించారు. గత ప్రభుత్వం

హయాంలో జొన్నాడలో అవినీతి ఇసుక కొండల్లా ఇసుక గుట్టలు ఉంటే చంద్రబాబు నాయుడు సెల్ఫీ తీసుకున్నారని గుర్తుచేశారు. ప్రజలకు ఉచితంగా ఇసుక సరఫరా చేస్తున్న ర్యాంపుల వద్దకు వెళ్లి మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డి సెల్ఫీ తీసుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ప్రజలకు సమస్యలు ఉంటే నేరుగా మా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రులు, ఎమ్మెల్యేలు నేరుగా కలుసుకుంటామని పరదాలు కట్టుకుని తిరిగే ప్రభుత్వం కాదని సత్యానందరావు చమత్కరించారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఇసుకను ఆదాయ వనరుగా మార్చి కోట్లు కొల్లగొట్టారని, నేడు ప్రజలకు ఇసుకను ఉచితంగా అందించడంతో ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ పెళ్లి కానుక

విశాలాంధ్ర - జగ్గంపేట, కిర్లంపూడి : జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అందజేస్తున్న పెళ్ళికానుకలను సోమవారం స్థానిక నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పార్టీ కాకినాడ జిల్లా జ్యోతుల నవీన్ అందజేశారు. కిర్లంపూడి మండలం సోమవరం గ్రామానికి చెందిన తూము లావణ్య జ్యోతుల శివ దంపతులకు గోనేడ గ్రామానికీ చెందిన పార్వతి నిమ్మల శివ దంపతులకు, జగపతినగరం గ్రామానికి చెందిన దేవి, మలిరెడ్డి వీరభద్రరావు దంపతులకు రూ.20 వేలు చొప్పున మూడు జంటలకు రూ.60 వేల చెక్కులను అందించారు. ఈ కార్యక్రమంలో కిర్లంపూడి ఎంపిపి

తోట రవి, భూపాలపట్నం సర్పంచ్ వీరంరెడ్డి కాశి బాబు, టీడీపి నాయకులు తోట గాంధీ, మారిశెట్టి భద్రం, కొత్త కొండబాబు, జీను మణిబాబు, చదరం చంటిబాబు, నీలం శ్రీను, తూము కుమార్, గుడాల రాంబాబు, మంచి కంటి శ్రీను, జట్ల వీరబాబు, సర్వసిద్ధి లక్ష్మణరావు, బద్ది సురేష్, కంచుమర్తి రాఘవ, కాళ్ల వెంకటేష్, అడబాల పెద్దబాబు, పల్లికొండ భద్రం తదితరులు పాల్గొన్నారు.

రత్నకుమారికి నాయి బ్రాహ్మణ సేవా సంఘం సభ్యులు పరామర్శ

విశాలాంధ్ర -కొవ్వూరు : కొవ్వూరు మున్సిపల్ చైర్ పర్సన్ భావన రత్నకుమారి అత్త బావన బోడెమ్మ ఇటీవల మృతి చెందారు సందర్భంగా భావన రత్నకుమారి కుటుంబాన్ని కొవ్వూరు పట్టణ నాయి బ్రాహ్మణ సేవా సంఘం సభ్యులు పరామర్శించారు. ఈ సందర్భంగా నాయి బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షులు మేడూరు వీర్రాజు మాట్లాడుతూ బోడమ్మ మరణం ఎంతో బాధాకరమని, మా సంఘం తరఫున వారికి ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నామన్నారు. భావన బోడెమ్మ ఉపాధ్యాయులుగా ఎన్నో సేవలు చేసి, కొవ్వూరులో ఎంతోమందిని విద్యావంతులుగా తీర్చిదిద్దారని ఆమె మరణం ఎంతో తీరంలోటని అన్నారు. ఈ కార్యక్రమంలో కొవ్వూరు పట్టణ నాయి బ్రాహ్మణ సేవా సంఘ అధ్యక్షుడు మేడూరు వీర్రాజు, గౌరవ సలహాదారులు బొండపల్లి నరసరావు, గౌరవ అధ్యక్షులు కోడూరు రాము , కొవ్వూరు పట్టణ ప్రధాన కార్యదర్శి పట్నాల శ్రీనివాస్, సహాయక కార్యదర్శ గొల్లజాబు సత్తిబాబు, పట్టణ నాయి బ్రాహ్మణ సేవా సంఘ సభ్యులు పాల్గొన్నారు.

మధ్యాహ్నా భోజన తనిఖీ

విశాలాంధ్ర-దేవరపల్లి: అంబటి సత్యనారాయణ రావు జిల్లా పరిషత్ హై స్కూల్లో సోమవారనాడు సమగ్ర శిక్ష మరియు మధ్యాహ్నా భోజనం అమలపై ఎస్ ఎస్ ఏ ఏ టి సంస్థ స్టేట్ రిసోర్స్ పర్సన్ బి సూర్య పర్యవేక్షణలో తనిఖీలు నిర్వహించారు అనంతరం విద్యా ర్థులతో కలసి భోజనం చేస్తూ వివరాలను మధ్యాహ్నం భోజనపై అడిగి తెలుసుకున్నారు ఈ కార్యక్రమంలో డిఆర్పి కె సీమరాజు విద్యా కమిటీ చైర్మన్ టీ వేముల రాజు వైస్ చైర్మన్ కమిటీ సభ్యులకు బాధ్యతలు గురించి సూర్య వివరించారు. ఈ కార్యక్రమంలో హై స్కూల్ హెచ్ఎం బి శ్రీలక్ష్మి ఉపాధ్యాయులు పిడి ఓరుగంటి నాగరాజు పాల్గొన్నారు

జీవో 91 రద్దు చేయాలని వినతి

విశాలాంధ్ర -కొవ్వూరు : ఎస్సీ కులాల సోషల్ అడిట్ అంటూ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో 91ని రద్దు చేయాలని మాలసంఘాల జేఏసీ కన్వీనర్ బొంతా శ్యామ్ రవిప్రకాష్ రెవెన్యూ డివిజినల్ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఎస్సీ వర్గీకరణ చేసే అధికారం రాష్ట్ర, కేంద్రం ప్రభుత్వాలకు లేదన్నారు. ఆర్టికల్ 339 ప్రకారం రాజ్యాంగబద్ధమైన ఎస్సీ కమిషన్ ఉందని వేరే కమిషన్ వేసే అధికారం రాష్ట్రాలకు లేదని పేర్కొన్నారు. రాజీవ్ రంజాన్ మిశ్రా కమిషన్ రద్దు చేయ్యాలని కోరారు. ఎస్సీ వర్గీకరణ చేస్తే రాష్ట్రప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మసా ఆనంద్ కొయ్య వెంకట్రావు, కోటే హరీష్, కన్నెం మురళి, యం బంగారు రాజు, బొంతా రవి కుమార్, వై అశోక్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానంకు విరాళం

విశాలాంధ్ర – మామిడికుదురు : అప్పనపల్లి శ్రీ బాల బాలాజీ స్వామి దేవస్థానం శాశ్వత నిత్యాన్నదాన ట్రస్ట్‌కు సోమవారం విజయనగరం వాసులు చింతపల్లి ఆదిత్య అఖిల దంపతులు లక్ష రూపాయలు విరాళం సమర్పించారని ఆలయ సహాయ కమిషనర్ ఎం సత్యనారాయణ రాజు తెలిపారు. వీరికి ఆలయ ప్రధాన అర్చకులు వేద ఆశీర్వచనం అందజేసి శేష వస్త్రములతో సత్కరించి స్వామి వారి చిత్రపటం అందజేశారు.

PUBLICATION

IN THE COURT OF THE HON'BLE II ADDL DIST COURT : Dr. B. R. AMBEDKAR KONASEEMA DIST: AMALAPURAM

EP No.38 of 2024 In AC No: 825 of 2011

Between:

Shriram Finance Limited, Amalapuram Branch, rep by its GPA holder **K.V.Sekhar, Amalapuram** ...D.Hr.

Vs

A.Gopala Krishna & Others ...J.Drs

1st JDr: A.Gopala Krishna, S/o. Anjaneyulu, D.No.2-262, Edarpalli, Amalapuram-533201, Dr.B.R.Ambedkar Konaseema District.

The above named D Hr company has instituted the above EP against you, and the same stands posted to **19-02-2025** at **10.30 A.M.** for your appearance, you are hereby required to appear personally or through advocate attend before this Hon'ble court at 10.30 AM and file your objections if any, failing which the matter will be heard and determined in your absence exparte as per Law.

//by the orders of the Hon'ble court//

V.R.Vidya Sankaram, Advocate, Amalapuram

Amalapuram Dt.20-12-2024 Cell: 98492 93793

PUBLICATION

IN THE COURT OF THE HON'BLE II ADDL DIST COURT : Dr. B. R. AMBEDKAR KONASEEMA DIST: AMALAPURAM

ARBEP No.583 of 2023 In AC No: 1015 of 2012

Between:

Shriram Finance Ltd, Amalapuram Branch, rep by its GPA holder **K.V.Sekhar** ...D.Hr.

Vs

Kondeti Chandra Sekhar & another ...J.DRs

1st JDr: Kondeti Chandra Sekhar, S/o. Ramachandra Rao, D.No.2-17/A, Panumilli, Mummidivaram (M), Dr.B.R.Ambedkar Konaseema District

The above named D Hr company has instituted the above ARBEP against you, and the same stands posted to **23-01-2025** at **10.30 A.M.** for your appearance, you are hereby required to appear personally or through advocate attend before this Hon'ble court at 10.30 AM and file your objections if any, failing which the matter will be heard and determined in your absence exparte as per Law.

//by the orders of the Hon'ble court//

V.K.S.Bhaskara Sastri, Advocate, Amalapuram

Amalapuram Dt.20-12-2024 Cell: 98483 44577

సమస్యల పరిష్కారానికి అర్జీల స్వీకరణ : కలెక్టర్

విశాలాంధ్ర – నల్లజర్ల : ప్రజా సమస్యలు పరిష్కారానికి మండల కేంద్రంలో అర్జీలు అందచేయాలని, వాటికీ జవాబుదారీతనం కలిగి పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి తెలియ చేశారు. సోమవారం స్థానిక నల్లజర్ల ఎంపిడివో కార్యాలయంలో పీజీఆర్ఎస్‌కు కలెక్టర్ హాజరై ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పి ప్రశాంతి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి ప్రతి సోమవారం జిల్లా, డివిజన్, మండల కేంద్రంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్న పీజీఆర్ఎస్‌కి ఎక్కువ మంది రావడం, మండల స్థాయిలో పరిష్కారం లభించే వాటి మీద రాజమహేంద్రవరం రావడం జరుగుతోందని పేర్కొన్నారు. మండల స్థాయి అధికారులకు ప్రజలు తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాలకు వచ్చి అర్జీలను అందించాల్సి ఉంటుందన్నారు. మండలస్థాయి అధికారులు అందరూ ఒక్క చోట ప్రజలకి అందుబాటులో ఉండి అర్జీలు పరిష్కారం చేయ్యాల్సి ఉందన్నారు. మొత్తం 47 అర్జీలను స్వీకరించడం జరిగిందనీ తెలిపారు. ఈ కార్యక్రమంలో నల్లజర్ల తహసీల్దార్ ఎస్ వి ఎస్ నాయుడు, ఎంపిడివో పి. సింహాద్రి, ఎంపిపి బి. జయలక్ష్మి, డివిజనల్ అభివృద్ధి అధికారి ఏ. స్లేవా రెడ్డీ, ఇతర మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలను ఆదుకుంటాం

విశాలాంధ్ర – కాకినాడ : ఈ నెల 4న రాజమండ్రిలో జరిగిన గేమ్ చేంజర్ ప్రీ రిలీజ్ ఫంక్షన్‌కు హాజరై తిరుగు ప్రయాణంలో రంగంపేట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించిన కాకినాడ రూరల్ గైగోలు పాడుకు చెందిన మణికంఠ, అశోక్ నగర్‌కు చెందిన చరణ్‌ల కుటుంబ సభ్యులను అన్నివిధాలా ఆదుకుంటామని కాకినాడ ఎంపీ తంగెళ్ళ ఉదయ్ శ్రీనివాస్ తెలిపారు. సోమవారం ఆయన బాధితుల నివాశాలకు వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి జనసేన పార్టీ తరుపున రూ.5 లక్షల చెక్కులను అందించారు. ఈ సందర్భంగా ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందడం భాధాకరమని. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని తెలిపారు.

పాడి రైతుల సంక్షేమానికి మినీ గోకులం షెడ్లు :నవీన్

విశాలాంధ్ర – జగ్గంపేట, కిర్లంపూడి : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పాడి రైతుల సంక్షేమం కోసం మినీ గోకులం షెడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టిందని టిడిపి కాకినాడ జిల్లా అధ్యక్షులు జ్యోతుల నవీన్ అన్నారు. కిర్లంపూడి మండలం వీరవరంలో నూతనంగా నిర్మించిన మినీ గోకులం షెడ్డును సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నవీన్ మాట్లాడుతూ గత వైఎస్సీపీ పరిపాలనలో గోకులం షెడ్లను పూర్తిగా విస్మరించిందన్నారు. మినీ గోకులం షెడ్ల నిర్మాణానికి ఉపాధి హామీ పథకం కింద రాయితీ ఇస్తుందని, చిన్న సన్నకారు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. గ్రామాల్లో పశు పోషణ, కోళ్లు, గొర్రెలు, మేకలు పెంపకానికి మెరుగైన వసతి కల్పిస్తూ, పెంపకందార్లను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. గోకులం పథకం కింద షెడ్లనిర్మాణానికి పశువుల పెంపకందార్లకు 90శాతం, గొర్రెలు, మేకలు, కోళ్ల పెంపకందార్లకు 70 శాతం చొప్పున రాయితీలు కల్పించడం జరుగుతుందన్నారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఎక్కువ గోకులం షెడ్లు తెచ్చే విధంగా చర్యలు చేపట్టారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో హరికృష్ణ, ఎంపీపీ తోట రవి, భూపాలపట్నం సర్పంచ్ వీరంరెడ్డి కాశిబాబు, టీడీపి నాయకులు తోట గాంధీ, చదరం చంటిబాబు, జీను మణిబాబు, ఆడపా భరత్ బాబు, నీలం శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

ఈసిఈ గ్యాలరీ హాలు ప్రారంభం

విశాలాంధ్ర – కాకినాడ : జెఎన్‌టియుకె ప్రాంగణంలో సోమవారం ఉదయం యుసిఇకె ఎలక్ట్రానిక్స్ & కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ (ఈసిఈ) విభాగం నందు నవీకరించిన (రెనోవేషన్) ఈసీఈ గ్యాలరీ హాలును ఇన్‌ఛార్జి ఉపకులపతి ప్రొ కెవిఎస్‌జి మురళీకృష్ణ ప్రారంభించారు. ఈసిఈ విభాగాధిపతి డా బి లీలాకుమారి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఇన్‌ఛార్జి ఉపకులపతి ప్రొ కెవిఎస్‌జి మురళీకృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. గౌరవ అతిథులుగా రెక్టార్ ప్రొ కెవి రమణ, ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ ప్రొ వి రవీంద్రనాధ్, అతిథులుగా యుసిఇకె ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ ప్రొ ఎన్ మోహన్‌రావు, వైస్ ప్రిన్సిపాల్ (అకడమిక్స్) ప్రొ జీవిఎస్‌ఆర్ దీక్షితులు విచ్చేశారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి ఉపకులపతి ప్రొ కెవిఎస్‌జి మురళీకృష్ణ మాట్లాడుతూ తనకు జెఎన్‌టియుకె ఈసిఈ గ్యాలరీ హాలుతో ఉన్నటువంటి మధురస్మృతులు మరెక్కడా ఉండవన్నారు. యుసిఇకె అధ్యాపకులకు ఈ హాలుతో అవినాభావ సంబంధం ఉందని, ఈసిఈ గ్యాలరీ హాలు ఒక అద్భుతమైన కళావేదిక అని, మరలా దీనికి పూర్వ వైభవం వస్తుందన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో మెలుగుతూ విద్యనభ్యసిస్తే నాలుగేళ్ల తర్వాత ప్రపంచవ్యాప్తంగా ఉన్నత స్థానాలలో నిలుస్తారన్నారు. ఈసిఈ గ్యాలరీ హాలు నవీకరణకు సహకరించిన చీఫ్ ఇంజనీర్ ప్రొ వి శ్రీనివాసులు, ఎలక్ట్రికల్ ప్రాజెక్ట్ ఇంజనీర్ డా ఎన్ సుమతిలను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. రెక్టార్ ప్రొ కెవి రమణ మాట్లాడుతూ బీటెక్‌లో ఈసిఈ విద్యార్థిగా ఇక్కడే చదువుకున్నానని, సిఎస్ఈ అధ్యాపకుడిగా ఈసిఈ గ్యాలరీ హాలులో విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధించానన్నారు. ఈసిఈ విభాగం ఆధ్వర్యంలో రూపొందించిన 'ద ఈసిఈ ప్రిసైజ్ వాల్యూమ్ 1, ఇష్యూ 4 మ్యాగజైన్‌ను ఇన్‌ఛార్జి ఉపకులపతి ప్రొ కెవిఎస్‌జి మురళీకృష్ణ ఆన్‌లైన్‌లో ఆవిష్కరించారు. అనంతరం రిటైర్డ్ ప్రొఫెసర్‌లైన ప్రొ మురళీధరశర్మ, ప్రొ బి ప్రభాకరరావు, ప్రొ ఐ శాంతి ప్రభలను అతిథులు శాలువాతో సత్కరించి మెమెంటోలను బహూకరించారు. ఈ కార్యక్రమంలో చీఫ్ ఇంజనీర్ ప్రొ వి శ్రీనివాసులు, డైరెక్టర్‌లు ప్రొ ఏఎం ప్రసాద్, ప్రొ ఎన్ బాలాజీ, ప్రొ కె పద్మప్రియ, మాజీ ఉపకులపతులు ప్రొ ఎస్ శ్రీనివాసకుమార్, ప్రొ కె పద్మరాజు, ఈసిఈ విభాగం అధ్యాపకులు, ఇంజనీరింగ్ విభాగం అధికారులు, నాన్ టీచింగ్ సిబ్బంది, పూర్వ విద్యార్థులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్రాంతి సంబరాలు

విశాలాంధ్ర-దేవరపల్లి: దేవరపల్లి గట్టు కాశీ విశ్వనాథం సుబ్బలక్ష్మి ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో దేవరపల్లి ఆర్యవైశ్య మహిళ సంఘం సభ్యులు ముందస్తు సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు ఆర్యవైశ్య మహిళలు అందరూ నూతన వస్త్రాలు ధరించి సాంప్రదాయ బద్ధంగా సంక్రాంతి వేడుకలు నిర్వహించారు ముందుగా గొబ్బెమ్మలుతో పూజలు నిర్వహించారు. అనంతరం ఆవు పిడకలు పేర్చి మట్టి కుండలో పొంగల్ వండి అమ్మవారికి నైవేద్యంగా పెట్టారు. వివిధ అలంకరణలతో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యంగా హరిదాసు వేషధారణతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సంక్రాంతి గొబ్బెమ్మ పాటలు, సంక్రాంతి పాటలు, పాడి ప్రేక్షకులను ఆదరించారు. దేవరపల్లి ఆర్యవైశ్య మహిళా సంఘం అధ్యక్షురాలు తీగల మంజు ఆర్యవైశ్య మహిళలు ఉత్సాహంగా సంక్రాంతి సంబరాలలో పాల్గొన్నారు.

మైక్ శబ్దాల ఇబ్బందులపై అర్జీ

విశాలాంధ్ర – సీతానగరం: చర్చ్ మైక్ శబ్దాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు పీజీఆర్ఎస్‌లో అర్జీ సమర్పించారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఎమ్ భారతి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఒకే ఒక అర్జీ వచ్చింది. ఈ అర్జీ మునుకుదులి గ్రామానికి చెందిన మల్లి వీర్రాజు అనే అర్జీ దారుడు తమ గ్రామంలో అర్ అండ్ బి రహదారికి అనుకొని ఉన్న ఆర్‌సిఎమ్ చర్చ్ నందు గల మైక్లు అధిక శబ్దాలు చేస్తూ శబ్ద కాలుష్యం చేస్తున్నాయి అన్నారు. దానివల్ల దాని చుట్టూ పక్కల నివాసం ఉంటున్న మాకు తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. చిన్న పిల్లలు, పెద్ద వాళ్ళు ఆరోగ్యం పై ప్రభావం చూపుతుంది అని కావున అధికారులు చర్యలు చేపట్టి మాకు భద్రత కల్పించాలని కోరారు. దీనిపై ఎంపిడిఓ స్పందిస్తూ ఈ అర్జీని సంబంధిత శాఖ అధికారులు బదిలీ చేసి సమస్యను సాధ్యమైనంత త్వరగా పరిష్కారం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల, గ్రామ అధికారులు పాల్గొన్నారు.

ఆదిత్య సివిల్ విభాగంలో అతిథి ఉపన్యాసం

విశాలాంధ్ర – గండేపల్లి : గండేపల్లి మండలం సూరంపాలెం. ఆదిత్య విశ్వవిద్యాలయంలోని సివిల్ ఇంజినీరింగ్ విభాగం KL యూనివర్సిటీలో అసోసియేట్ ప్రొఫెసర్ , సివిల్ ఇంజినీరింగ్ హెడ్ Dr పి పోలు రాజు నేతృత్వంలో బీటెక్, 2వ, 3వ సంవత్సరాల విద్యార్థులకు అతిథి ఉపన్యాసాలను నిర్వహించింది. మొదటి ఉపన్యాసం, "మిక్సింగ్ మరియు ప్లేసింగ్ కాంక్రీట్ & డ్యూరబిలిటీ సమయంలో ఫీల్డ్ మిస్టేక్స్, కాంక్రీట్ మిక్సింగ్, ప్లేస్‌మెంట్‌లో దీర్ఘకాలిక మన్నిక మరియు నిర్మాణ సమగ్రతను నిర్ధారించడానికి సాధారణ లోపాలను నివారించడం యొక్క ప్రాముఖ్యతను హైలైట్ చేసింది. రెండవ సెషన్, 'రెట్రోఫిట్టింగ్ టెక్నిక్స్ ఉపయోగించి స్ట్రక్చరల్లీ డెఫిషియంట్ ఎలిమెంట్స్ యొక్క స్ట్రక్చరల్ పెర్ఫార్మెన్స్' అనే అంశంపై, ఆధునిక సివిల్ ఇంజనీర్లకు కీలకమైన నైపుణ్యం, వృద్ధాప్యం మరియు లోపభూయిష్ట నిర్మాణాలను బలోపేతం చేయడానికి వినూత్న పద్ధతులపై దృష్టి సారించింది. విద్యార్థులు మెటీరియల్‌తో చురుగ్గా నిమగ్నమై చర్చల్లో పాల్గొన్నారు. సివిల్ ఇంజనీరింగ్ యొక్క ఈ క్లిష్టమైన అంశాల గురించి లోతైన అవగాహనను పొందారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతి, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధికి కూటమి ప్రభుత్వం బాటలు

విశాలాంధ్ర - పిఠాపురం : మండలం lob విరవ గ్రామంలో రోడ్లను పిఠాపురం తెలుగుదేశం పార్టీ ఇంచార్జి ఎస్‌విఎస్‌ఎన్ వర్మ పరిశీలించారు. సందర్భంగా వర్మ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో చంద్రబాబు, పవన్ కళ్యాణ్ నరేగాలో రోడ్లు అభివృద్ధికి రూ.4500 కోట్లు రాష్ట్ర వ్యాప్తంగా వెచ్చించడం జరిగిందన్నారు. అందులో భాగంగా పిఠాపురం నియోజకవర్గానికి రెండు విడతలుగా రూ.15 కోట్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. విరవ గ్రామంలో రోడ్ల నిర్మాణం చేపడుతున్న సందర్భంగా ఆ రోడ్ల నాణ్యత పరిశీలించడానికి ఇక్కడకి విచ్చేయడం జరిగిందని తెలిపారు. మహిళలు అందరూ ఎంతో ఆనందంగా ఉన్నారని వర్మ అన్నారు. 5 ఏళ్ళు వైసీపీ పాలనలో ప్రజలను పట్టించుకునే నాథుడే కరువైరని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అభివృద్ధికి బాటలు వేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సకుమళ్ళ గంగాధర్‌రావు, సకుమళ్ళ నాగబాబు, నడిగట్ల అన్నవరం తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వే రద్దు చేయాలి

విశాలాంధ్ర - ఆలమూరు : గత ప్రభుత్వ హయాంలో లోప భూయిష్టంగా నిర్వహించిన రిసర్వేను రద్దుచేసి 2019 సంవత్సరానికి ముందు ఉన్నటువంటి భూ రికార్డులను భూమికగా తీసుకొని రైతుల రికార్డులను సరిచేయాలని కోరుతూ ఆలమూరులో జరిగిన రెవెన్యూ సదస్సులో రైతులు డిప్యూటీ తహసీ ల్దార్ సుబ్బరాజుకు వినతి పత్రం అందజేశారు. ఈ అంశాన్ని ఉన్నతాధికారుల ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకువెళ్లాలని వారు కోరారు. గత ప్రభుత్వ హయాంలో ఫీల్డ్‌లో దిగకుండా డ్రోన్ సర్వే నిర్వహించి అనేక లోపాలతో కూడిన భూ రికార్డులను తయారు చేశారని కొందరికి భూమి కొలతలు ఎక్కువ రావడం, కొందరికి తక్కువ రావడం, కొన్ని భూములు ఉమ్మడి యాజమాన్యంగా నిర్ణయించడం సదరు భూములను ప్రతి రైతు సబ్ డివిజన్ చేయించుకోవాలని అధికారులు చెప్పడంతో రైతులు పొలం పనులు వదిలిపెట్టి ఆఫీసుల చుట్టూ తిరగడం చాలా వ్యయ ప్రయాసలతో కూడి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఈనాం భూములపై కూడా ఏ విధమైన నిర్ణయం తీసుకోపోవడంతో రైతులు నానా పాట్లు పడుతున్నారని ఆ వినతిపత్రంలో తెలిపారు. సర్వే నెంబర్లలో ఉన్న పొరపాట్లు సరిచేసి రైతులందరికీ మేలు జరగాలంటే 2019 సంవత్సరానికి ముందు ఉన్నటువంటి పాస్ పుస్తకాల ప్రకారం భూ రికార్డులు సరిచేయాలని కోరారు. కూటమి నాయకులు, రైతులు పాల్గొన్నారు.

'ఆటలతో ఆరోగ్యం' పోటీలు

విశాలాంధ్ర - మామిడికుదురు : జిల్లా కలెక్టర్ ఆదేశాల ప్రకారం 'ఆటలతో ఆరోగ్యం ' పేరిట మామిడి కుదురు హైస్కూల్ ప్రాంగణంలో మూడు రోజులపాటు మండల సాయి ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కె వెంకటేశ్వరరావు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం 'ఆటలతో ఆరోగ్యం' పేరిట క్రీడోత్సవాల నిర్వ హణకై ప్రధానోపాధ్యాయులు, సచివాలయ ఉద్యోగులు, కార్య దర్శిలతో కో- ఆర్డినేషన్ సమావేశం నిర్వహించామన్నారు. ఈ సమా వేశంలో మండల విద్యాశాఖాధి కారులు లక్ష్మీనారాయణ, ఎం వెంకన్నబాబులు పాల్గొన్నారు.

10 నుంచి సప్తాహ మహోత్సవం

విశాలాంధ్ర - మామిడికుదురు : పెదపట్నంలో ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఈ నెల 10 నుంచి 17 వరకు శ్రీ మూలేశ్వర స్వామి, శ్రీ వేణు గోపాల స్వామి, శ్రీ కనక దుర్గ అమ్మవార్ల దేవస్థానముల నందు సప్తాహ మహోత్సవం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహక కమిటీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది.

బాలబాలికల వికాసానికి కృషి చేద్దాం

విశాలాంధ్ర - కడియం : బాలబాలికల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేయాలని, వారు అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలని కడియం ఎంపీపీ వెలుగుబంటి వెంకట సత్య ప్రసాద్ అన్నారు. మండల స్థాయి కిషోర్ వికాసం ఒకరోజు శిక్షణ కార్యక్రమం ఎండిఓ రమేష్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎండిఓ రమేష్ మాట్లాడుతూ మండల స్థాయిలో శిక్షణ పొందినవారు, వారి గ్రామాల్లో కమిటీలుగా ఏర్పడి పిల్లలకు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. కడియం సిఐ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఇటీవల మండలంలో జరిగిన అనేక అంశాలను గుర్తు చేస్తూ, పిల్లలపై ఎవరైనా నేరాలకు పాల్పడితే కఠినమైన శిక్షలు ఉన్నాయన్నారు. మండల కన్వీనర్ గొల్లపల్లి సత్యనారా యణ మాట్లాడుతూ బాలిక వివాహాలు, వివక్షత, మానవ అక్రమ రవాణా మొదలగు గణాంకాలను వివరించారు. అనం తరం హెచ్ఇఓ రామకృష్ణ బాలికల్లో ఎక్కువమంది రక్తహీనతతో బాధపడుతు న్నారని ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో మండలంలోని పదకొండు గ్రామాలకు చెందిన ఉపాధ్యాయులు, ఏఎన్ఎంలు, అంగన్వాడీ టీచర్లు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

సురేష్‌రెడ్డి సేవా నిరతికి నిలువుటద్దం 'ధాత్రి' ట్రస్టు

విశాలాంధ్ర - పెదపూడి : చిన్న వయసులోనే తన సేవా తత్పరతతో జన హృదయాల్లో నిలిచిన సబ్బెళ్ళ సురేష్‌రెడ్డి భౌతికంగా దూరమైనా ధాత్రి ట్రస్ట్ ద్వారా తన స్నేహితులు అందిస్తున్న సేవా కార్యక్రమాల ద్వారా ఇప్పటికీ సజీవంగానే ఉన్నారని హితకారిని సమాజం మాజీ స్టేట్ డైరెక్టర్ వుండ్రు సత్యనారాయణ అన్నారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం పెదపూడి మండలం కరకుదురు హైస్కూల్ 10వ తరగతి విద్యార్థులకు ఉచిత స్టడీ మెటీరియల్ దివంగత సురేష్ తండ్రి అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సబ్బెళ్ళ కృష్ణారెడ్డి విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన కుమారుడు సురేష్ రెడ్డి మరణించడం తన కుటుంబానికి నష్టమని అయితే సురేష్ రెడ్డి సత్ప్రవర్తనతో మంచి వ్యక్తిత్వం కలిగిన యువకులను స్నేహితులుగా పొందాడని సురేష్ రెడ్డి మరణించిన తర్వాత అతనిని సజీవంగా సమాజంలో నిలవాలని ఉద్దేశంతో స్నేహితులు సబ్బెళ్ళ సురేష్ రెడ్డి మెమోరియల్ చారిటబుల్ ధాత్రి ట్రస్టు ఏర్పాటు చేసి గత మూడు సంవత్సరాలుగా చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమన్నారు. సురేష్ రెడ్డి మూడవ వర్ధంతిని పురస్కరించుకుని ఇప్పటికే 700 మంది విద్యార్థులకు పదవ తరగతి స్టడీ మెటీరియల్(ఆల్ ఇన్ వన్)అందించారని కృష్ణారెడ్డి తెలిపారు. వుండ్రు వీరవెంకట సత్యనారాయణ మాట్లాడుతూ సబ్బెళ్ళ సురేష్ రెడ్డి సేవా భావం కలిగిన యువకుడని, కరోనా సమయంలో సురేష్ రెడ్డి క్రియేట్ చేసిన ప్లాస్మా డొనేషన్ యాప్ ఎంతోమందికి సమయానికి ప్లాస్మా అందించడానికి దోహద పడిందని అటువంటి సేవ గుణం కలిగిన సురేష్ రెడ్డి మరణం అప్పట్లో అందర్నీ కలిచివేసిందని అన్నారు. కార్యక్రమంలో ధాత్రి ట్రస్ట్ ప్రత్యేక ఆహ్వానితులు నల్లమిల్లి వెంకటరెడ్డి (789 శ్రీను), ధాత్రి చారిటబుల్ ట్రస్ట్ కార్యదర్శి చింతాప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు కరప విద్యార్థులు

విశాలాంధ్ర - కరప : నక్కా సూర్యనారాయణమూర్తి జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల, కరప విద్యార్థులు హసన్ బాద జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన కుడో మిక్సిడ్ మార్షల్ ఆర్ట్స్ పోటీలలో విజయం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం శ్రీనివాసరావు తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన పి వీర ప్రవీణ కుమార్, డి ఈశ్వర్ దుర్గాప్రసాద్, జి దుర్గా దిలీప్, పి రవి కిరణ్, ఎ రోహిన్, ఎన్ యశ్వంత్ కృష్ణ చైతన్య, టి దుర్గాప్రసాద్, డి డేవిడ్, వి అభిరామ్‌లను ఎస్ఎంసి ఛైర్మన్ దేవు దుర్గారావు, పాఠశాల పిడి కే శ్రీనివాస రావు, చంద్రశేఖర్, స్టాఫ్ సెక్రటరీ మారిశెట్టి రమేష్, బి స్వర్ణ రాణి, ఎన్ బుజ్జి, టేకుమూడి శ్రీనివాస్, బి సుధాకర్, కె సుబ్రహ్మణ్యం, మాణిక్యంబ తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పుంగనూరు ఆవుకు ద్వితీయ స్థానం

విశాలాంధ్ర - కడియం : అంబేద్కర్ కోనసీమ జిల్లా, మలికిపురం మండలం, కేశన పల్లి గ్రామంలో గోసమ్మేళనం ఈనెల 3,4,5, తేదీలలో నిర్వ హించిన ఒంగోలు, పుంగనూరు, గిర్ ఆవుల అందాల పోటీల్లో కడియపులంక గ్రామానికి చెందిన రైతు ఆలమూరు గోవిందుకి చెందిన పుంగనూరు ఆవుకు రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానం పొందింది. నిర్వాహకులు రైతు గోవిందుకి మెమెంటో పాటు రూ.7500 నగదు బహుమతి అందచేశారు.

రైతులకు అందుబాటులో యూరియా

విశాలాంధ్ర - గోపాల పురం : రైతులు తమ పంట పొలాలకు అధిక మొత్తంలో యూరియాను వాడవద్దని మండల వ్యవసాయ అధికారి జి రాజారావు తెలిపారు. సోమవారం పాత్రికేయులతో గత రెండు రోజుల్లో 290 మెట్రిక్ టన్నుల యూరియా రావడం జరిగిందని ఆరు సొసైటీలు మరియు మన గ్రోమోర్ సెంటర్ - దొంద పూడి గ్రామాల్లో రైతులకు అందుబాటులో ఉంచడం జరిగిందని రైతులు ఎవరు యూరియా లేదు అనే భావన వద్దని బి. రాజారావు తెలిపారు. రైతులు అవసరం మేరకు మాత్రమే యూరియాని వినియోగించాలన్నారు.

పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి

విశాలాంధ్ర - యు కొత్తపల్లి : గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని దోమ పిడి అడపా వెంకటలక్ష్మి అన్నారు. కొత్తపల్లి మండలం కుతుకుడు మిల్లిలో జరుగుతున్న సీసీ రోడ్లను సోమవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీసీ రోడ్ల పనులు త్వరతాగతం పూర్తి చేయాలన్నారు. పనులకు సంబంధించి తప్పనిసరిగా బోర్డును ఏర్పాటు చేయాలని కాంట్రాక్టర్లకు సూచించారు.

VASTU HOUSING FINANCE

వాస్తు హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్
యూనిట్ 203 & 204, 2 వ అంతస్తు, "ఏ" వింగ్, నవభారత్ ఎస్టేట్, జకారియా బందర్ రోడ్, సేవ్రి (వెస్ట్), ముంబై 400015. మహారాష్ట్ర.
సిఐఎన్ నం. : యు65922ఎంహెచ్2005పిఎల్‌సి272501

స్వాధీనత ప్రకటన

సెక్యూరిటైజేషన్ & రీ కన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్టు చట్టం -2002 క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలు-2002 నిబంధన 9తో చదివే సెక్షన్ 13(12) కింద అతనికి సంక్రమించిన అధికారాలను ఉపయోగించి వాస్తు హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ అధీకృత అధికారిగా ఈ దిగువ సంతకందారు ఈ కింద పేర్కొన్న రుణగ్రహీతలకు సదరు నోటీసు అందిన తేదీ నుండి 60 రోజుల్లోగా సంబంధిత నోటీసులో పేర్కొన్న బకాయిలను తిరిగి చెల్లించవలసిందిగా ఈ కింద పేర్కొన్న తేదీన డిమాండ్ నోటీసు జారీచేయడమైనది. రుణగ్రహీతలు బకాయి మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో విఫలమైనందున పైన పేర్కొన్న చట్ట నిబంధనల్లో నిబంధనల 9తో చదివే సెక్షన్ 13(4) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించి ఈ కింద వివరించబడిన ఆస్తిని దిగువ సంతకందారు ఈ కింద వివరించిన షెడ్యూల్ ఆస్తిని స్వాధీనం చేసుకోవడమైనది. ఈ ఆస్తితో ఎటువంటి లావాదేవీలు నెరపరాదని,ఈ ఆస్తితో ఏ ఒప్పందాలైనా ఈ కింద పేర్కొన్న మొత్తం బకాయి మరియు దానిపై వడ్డీ, వ్యయాలు మొదలైనవాటి కొరకు వాస్తు హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ బ్రాంచ్ చార్జికి లోబడి వుండునని ప్రత్యేకించి రుణగ్రహీత , హామీదారు మరియు సాధారణ ప్రజలను ఇందుమూలంగా హెచ్చరించడమైనది.

వ. నం	రుణగ్రహీత, సహ-రుణగ్రహీత పేరు మరియు లోన్ ఎక్కౌంట్ నం.	డిమాండ్ నోటీసు తేదీ మొత్తం బకాయి	ఆస్తి యొక్క వివరాలు	స్వాధీనత రకం & తేదీ
1	వీలు రాము, వీలు సత్యకుమారి అరిగెల పెద్దిరాజు LP0000000103516	20-జనవరి-24 16- జనవరి-24 నాటికి రూ.1600167	ఆర్.ఎస్.నం. 24-8 బి, పెదగడవిల్లి గ్రామం మరియు గ్రామ పంచాయతీ, ఉప్పలగుప్తం, తూర్పు గోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్, 533222, ఆస్తి విస్తీర్ణం: 145 చదరపు గజాలు.	భౌతిక స్వాధీనత స్వాధీనత తేదీ: 03-జనవరి-2025
2	వెంకటేశ్వరరావు రోల, లక్ష్మి రోల LP0000000025937	20-ఏప్రిల్-24 16- ఏప్రిల్-24 నాటికి రూ.1542011	ఆంధ్రప్రదేశ్,533229, తూర్పుగోదావరిజిల్లా,కొత్తపేట మండలం,కొత్తపేటగ్రామం, కొత్తపేట గ్రామ పంచాయతీ, కొత్త డోర్ నం.3-107, పాత డోర్ నం.3-83, సవరించిన సర్వే నం.635/1లో జిరాయితీ మెరక.112.5చ॥గ॥ప్లాట్/నిర్మిత ప్రదేశం.	భౌతిక స్వాధీనత స్వాధీనత తేదీ: 03-జనవరి-2025

తేదీ: 07.01.2025
ప్రదేశము: తూర్పుగోదావరి
అధీకృత అధికారి
వాస్తు హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్

కేంద్ర హోం మంత్రిని బర్తరఫ్ చేయాలని నిరసన

విశాలాంధ్ర -నూజివీడు : పార్లమెంటులో భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్‌ను అవమానపరుస్తూ మాట్లాడిన కేంద్ర హోం మంత్రిని బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ నూజివీడు మండలం పోతురెడ్డిపల్లి గ్రామంలో అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. గ్రామంలోని అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం సీనియర్ నేత కొమ్మన నాగేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర బీజేపీ ప్రభుత్వం భారత రాజ్యాంగం స్థానంలో మనుధర్మశాస్త్రం అమలుచేయడానికి ప్రయత్నం చేస్తున్నదన్నారు. ఆ ప్రయత్నం నిలువరించేందుకు లాల్, నీల్ జెండాలు ఐక్య పోరాటం చేయాలని కోరారు. అమిత్ షా వ్యాఖ్యల్ని రాష్ట్రంలోని ప్రధాన పార్టీల నాయకులు ఖండించకపోవడం విచారకరమన్నారు. వర్ణ వ్యవస్థ తెచ్చి ప్రజా హక్కులు, సమానత్వం హరించే కుట్ర బీజేపీ ప్రభుత్వం చేస్తుందని ఆగ్రహం వ్యక్తంచేశారు. సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు చలసాని వెంకట రామారావు మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం రిజర్వేషన్లు రద్దు చేసి ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేయాలని చూస్తున్నదని ఖచ్చితంగా ఎర్రజెండా సమరశీల పోరాటం చేస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు మడుపల్లి నాగేంద్రరావు, నిమ్మగడ్డ నరసింహా, చాట్ల పుల్లారావు అంబేద్కర్ యూత్ నేతలు మేడా రవీంద్ర, దారా యెహోవా పాల్గొన్నారు.

రూ.5 వేలు విరాళం

విశాలాంధ్ర - ఏలూరు: సిరిపరుపు కపర్ది, తేజశ్రీల కుమారుడు చేతన్ మొదటి పుట్టినరోజు సందర్భంగా సీపీఐ ఏలూరు జిల్లా సమితికి రూ.5వేల విరాళంను సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్యకు సోమవారం కపర్ది, బండి వెంకటేశ్వరరావు అందజేశారు.

విజిలెన్స్ అధికారుల రైస్ మిల్లు తనిఖీ

విశాలాంధ్ర - గోపాలపురం : మాతంగమ్మ తల్లి రైస్ మిల్లులో పిడిఎఫ్ రైస్ ఉన్నట్లుగా వచ్చిన ఫిర్యాదు మేరకు తనిఖీలు నిర్వహిస్తున్నట్లు విజిలెన్స్ డిఎస్‌పి ఎస్. తాతారావు తెలిపారు. డీఎస్పీ తాతారావు తెలిపిన వివరాల ప్రకారం పాత్రికేయులతో మాట్లాడుతూ సోమవారం మం డలంలో కోమటి కుంట శివారులో మాతంగమ్మ తల్లి రైస్ మిల్లు వ్యాపార భాగస్వాముల మధ్య వర్గ విభేదాలు తలెత్తడంతో మిల్లులో పిడిఎఫ్ రైస్ ఉన్నట్టు, అక్రమ బియ్యం రవాణా అవుతు న్నట్లుగా, ఫిర్యాదుల రావడంతో మండల తహసీ ల్దార్ కే. అజయ్ బాబు ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించామని దీనిపై దర్యాప్తు చేస్తున్నామని పూర్తి వివరాలు తెలియ చేస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ సివిల్ సప్లై ఆఫీసర్ ఆంజనేయులు, సివిల్ సప్లై అసిస్టెంట్ మేనేజర్ శ్రీరామ్, విజిలెన్స్ సిఐ గోపాలకృష్ణ, విజిలెన్స్ ఎమ్మార్వో విజయ్ కుమార్ తూనికలు కొలతల విభాగం అధికారి, వీఆర్వో మురళీకృష్ణ రైస్ మిల్లు యాజమాన్యం పాల్గొన్నారు.

రేషన్ బియ్యం సీజ్

విశాలాంధ్ర - కడియం : కడియం మండలం కడియపులంకలో అక్రమంగా నిల్వ చేసిన 2530 కిలోల రేషన్ బియ్యాన్ని రాజమండ్రి ఎమ్మెస్ఓ కె సూర్య ప్రభాకర్ సీజ్ చేశారు. ఆయన తెలిపిన వివరాలు ప్రకారం గ్రామపంచాయతీ రోడ్డు సమీపంలో బియ్యం మూటలు ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం రావడంతో స్థానిక రెవెన్యూ సిబ్బందితో వెళ్లి పరిశీలించగా బియ్యంతో ఉన్న 49 ప్లాస్టిక్ సంచుల మూటలను పిడిఎస్ బియ్యంగా గుర్తించామని, వాటిని తూకం వేయగా 2530 కిలోల బియ్యం నిర్ధారించినట్లు తెలిపారు. ఈ బియ్యం ఎవరివి అనే దానిపై దర్యాప్తు చేస్తున్నామని, గుర్తించిన బియ్యాన్ని సీజ్ చేసి భద్రత నిమిత్తం కడియం శ్రీ వెంకట సూర్య సుబ్బరాయ రైస్ మిల్లుకు తరలించినట్లు ఆయన వెల్లడించారు.

చెత్త నుంచి రక్షణ కల్పించండి : రైతులు వినతి

విశాలాంధ్ర - సామర్లకోట : సామర్లకోట మండలం పనసపాడులో చెత్త భారీ నుంచి రక్షణ కల్పించాలని రైతులు కోరుతున్నారు. సోమవారం సామర్లకోట మండల పరిషత్లో ఎంపీడీవో హిమామహేశ్వరికి వినతిపత్రం అందించారు. చెత్త సంపద కేంద్రం పేరుతో పనసపాడు కాలవ గట్టుపై డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయడం మినహా, సంపద చేయలేదన్నారు. బయో మెడికల్ వ్యర్థాలతో సహా చెత్త కాలువలో నిండిపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నట్లు తెలిపారు. చెత్తను తొలగించాలని కోరారు.

'ఆటలతో ఆరోగ్యం' విజయవంతం చేయండి

విశాలాంధ్ర - అల్లవరం : స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ఎంపిడిఓ బి కృష్ణ మోహన్ ఈ నెల 7, 8, 9 తేదీలలో కొమరగిరి పట్నం హైస్కూల్‌లో నిర్వహించే కోనసీమ క్రీడోత్సవ్ -ఆటలతో ఆరోగ్యంపై ఎంఈఓ -2 పిడిలు, పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపిడిఓ మాట్లాడుతూ ఈ కార్యక్రమం విజయవంతం అయ్యేలా వాలీబాల్, ఖో ఖో ఇతర క్రీడలలో మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పాల్గొనేలా చూడాలని meo-2ను ఆదేశించారు. స్కూల్ గ్రౌండ్‌లో మెడికల్ క్యాంప్, టెంట్, త్రాగునీరు, స్నాక్స్, పారిశుధ్యం ఏర్పాటు చేయాలని కార్యదర్శులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఎంపిడిఓ బి కృష్ణ మోహన్, ఎంఇఓ 2 ఏడుకొండలు, పిడి ముసలయ్య, కార్యదర్శులు చిక్కం శ్రీను, రాజ్ మోహన్, దుర్గా, శ్రీను, సత్యనారయణ పాల్గొన్నారు.

ఘనంగా ప్రజా ఉత్సవాలు ప్రారంభం

ఫల, పుష్ప ప్రదర్శన ప్రారంభించిన సీఎం రంగస్వామి

విశాలాంధ్ర - యానాం : కేంద్రపాలిత ప్రాంతమైన యానాం జిఎంసి బాలయోగి క్రీడా ప్రాంగణంలో పుదుచ్చేరి పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 21వ ప్రజా ఉత్సవాలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. పుదుచ్చేరి ముఖ్యమంత్రి ఎన్ రంగస్వామి, స్పీకర్ సెల్వం, మత్స్య శాఖ మంత్రి లక్ష్మీనారాయణ, వ్యవసాయ శాఖ మంత్రి జై కుమార్, పౌర సరఫరాల శాఖ మంత్రి తిరుమురుగన్, పలువురు ఎమ్మెల్యేలు ఈ ఉత్సవాలకు హాజరయ్యారు. పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు ఘనంగా స్వాగతం పలికారు. ప్రజా ఉత్సవాలు స్వాగత గీతంతో ప్రారంభమయ్యాయి. అనంతరం శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణం త్రిడి వీడియోను సీఎం ఆవిష్కరించారు. సభాధ్యక్షులు యానాం శాసనసభ్యులు గొల్లపల్లి శ్రీనివాస అశోక్ మాట్లాడుతూ అనేక అభివృద్ధి కార్యక్రమాలు సుమారు రూ. 9:30 కోట్లతో ప్రారంభించడం చాలా అభినందనీయమన్నారు. గత నాలుగేళ్లుగా పెండింగ్‌లోవున్న మరి కొన్ని పనులు, మిగిలిన 15 నెలల కాలంలో పూర్తి చేయాలని సీఎం రంగస్వామిని సభాముఖంగా కోరారు. ఈ కార్యక్రమాలను దిగ్విజయంగా నడిపిస్తున్న పుదుచ్చేరి ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావును అభినందించారు. జాతీయ కళాకారులచే గొట్టపు ఆర్ట్, ప్రముఖ కళాకారులచే మహాభారతం రామాయణం, శివ పురాణంలోని కథల ప్రదర్శన, పల్సర్ బైక్ సాంగ్ ఫ్రేమ్ రమణ టీం చే, తెలుగు పాటల ప్రదర్శన, ఇండియా గాట్ టాలెంట్ విన్నర్ తదితర ప్రదర్శనలు అందరిని విశేషంగా ఆకర్షించారు. పరిపాలనాధికారి ఆర్ మునిస్వామి, పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రసాది మల్లాడి కృష్ణారావు సీఎం రంగస్వామి, మంత్రులు బృందాన్ని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

హెల్త్ పెన్షన్ల తనిఖీ

విశాలాంధ్ర - గండేపల్లి : కూటమి ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికి హెల్త్ పెన్షన్లు అందే విధంగా చర్యలు తీసుకుంటుందని అందులో భాగంగా ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకం కింద హెల్త్ పెన్షన్లు వెరిఫికేషన్ ప్రక్రియ ప్రారంభించిందని ఎంపీడీవో నాతి బుజ్జి అన్నారు. సోమ వారం కాకినాడ ప్రభుత్వ హాస్పిటల్ నుంచి వచ్చిన ప్రత్యేక వైద్య బృందం వారిచే గండేపల్లి మండలం లోని గండేపల్లి, మల్లేపల్లి, నీలాద్రిరావు పేట, ఎన్‌టి రాజాపురం, జెడ్ రాగం పేట, యల్లమిల్లి గ్రామాలకు చెందిన 09 హెల్త్ పెన్షన్లు వెరిఫికేషన్ చేసినట్లు ఎంపీడీవో తెలిపారు.